ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888


పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు ,
జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి
పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888


Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 02 సంచిక -285 | పేజీలు - 8 వెల - 03/- | శుక్రవారం 30 జనవరి 2026


## 2027 కల్లా బెంగళూరు-విజయవాడ
# ఎకనామిక్ కారిడార్

**రహదారుల నిర్మాణ పనుల పురోగతిపై సీఎం చంద్రబాబు సమీక్ష**

**2029 నాటికి రూ.1.4 లక్షల కోట్ల ఎన్‌హెచ్ పనులు పూర్తి చేయాలని లక్ష్యం**

**ప్రధాన ఓడరేవులను జాతీయ రహదారులతో అనుసంధానించాలని సూచన**

**రాష్ట్రంలో గుంతల్లేని రోడ్ల కోసం ఆధునిక టెక్నాలజీ వినియోగంపై దృష్టి**




అమరావతి,**జనవరి 29 రిపబ్లిక్ న్యూస్.**
రాజధాని అమరావతిని అనుసంధానించే బెంగళూరు-కడప-విజయవాడ ఎకనామిక్ కారిడార్ పనులను 2027 నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు డెడ్‌లైన్ విధించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న రూ.42,194 కోట్ల విలువైన పనులను వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేయాలని సూచించారు. ప్రాజెక్టుల పూర్తి విషయంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ఒక బెంచ్‌మార్క్‌గా నిలవాలని ఆకాంక్షించారు.మిగతా 2లో...

# దేశ అభివృద్ధి లక్ష్యంగా నిర్ణయాలు

**ఐరోపా సమాఖ్యతో ఒప్పందంపై మోడీ**

**రాష్ట్రపతి ప్రసంగం ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించదని వ్యాఖ్య**




న్యూఢిల్లీ,**జనవరి 29 రిపబ్లిక్ న్యూస్.**
పార్లమెంటు సమావేశాలు బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో ప్రారంభమయ్యాయి. గురువారం పార్లమెంట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా మీడియాతో ప్రధాని మోదీ మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా గురువారం ప్రధాని మోదీ పార్లమెంట్ వద్ద మీడియాతో మాట్లాడారు. దేశ అభివృద్ధే లక్ష్యంగా తమ ప్రభుత్వంమిగతా 2లో...



# అశ్రునయనాల మధ్య అజిత్ పవార్ అంత్యక్రియలు

**ప్రభుత్వ లాంఛనాలతో దివంగత నేతకు వీడ్కోలు**

**కేంద్రహోంమంత్రి అమిత్ షా తదితరుల నివాళి**

ముంబై,**జనవరి 29 రిపబ్లిక్ న్యూస్.**
అశ్రునయనాల మధ్య దివంగత మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ అంత్యక్రియలు ముగిశాయి. గురువారం ఉదయం పుణెలోని బారామతి సమీపంలోగల విద్యా ప్రతిష్ఠాన్ మైదానంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలను నిర్వహించారు. పవార్ పెద్దకుమారుడు అంత్యక్రియలను నిర్వహించారు. అంతకముందు..మిగతా 2లో...



# చెవిరెడ్డికి బెయిల్

**ఏపీ లిక్కర్ స్కామ్ కేసు**

**ముగ్గురికి బెయిల్ మంజూరు..మరో ఇద్దరికి రద్దు**

**226 రోజుల జైలు జీవితాన్ని గడిపిన చెవిరెడ్డి**

**సజ్జల శ్రీధర్ రెడ్డి, వెంకటేశ్ నాయుడులకు కూడా బెయిల్**



అమరావతి,**జనవరి 29 రిపబ్లిక్ న్యూస్.**
ఏపీ లిక్కర్ స్కామ్ కేసులో నిందితుల బెయిల్ పిటిషన్లను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న సజ్జల శ్రీధర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్ నాయుడులకు ధర్మాసనం బెయిల్ మంజూరు చేసింది. అయితే.. ఈ కేసులో కీలక నిందితుడిగా ఉన్న రాజ్ కసిరెడ్డి, ముప్పిడి అవినాశ్ రెడ్డి బెయిల్ పిటిషన్లను మాత్రమం న్యాయస్థానం కొట్టివేసింది. బెయిల్ వచ్చిన ముగ్గురికి కోర్టు పలు షరతులను విధించింది. ప్రధానంగా పాస్‌పోర్టులను మేజిస్ట్రేట్ కోర్టులో సమర్పించాలని, న్యాయమూర్తి అనుమతి లేకుండా దేశం విడిచి మిగతా 2లో...



# 7.2 శాతానికి జీడీపీ వృద్ధి

**పార్లమెంట్ ముందుకు ఆర్థిక సర్వే**


**ఉభయ సభల్లో ప్రవేశ పెట్టిన నిర్మలా సీతారామన్**

న్యూఢిల్లీ,**జనవరి 29 రిపబ్లిక్ న్యూస్.**
దేశ ఆర్థిక గమనానికి దిక్సూచిగా నిలిచే ఆర్థిక సర్వేను కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా 2025-26 ఆర్థికసర్వే ను కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. తర్వాత రాజ్యసభలో కూడా మంత్రి సర్వేను ప్రవేశపెట్టారు. కేంద్ర బడ్జెట్ సమర్పణకు ముందు ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టడం మిగతా 2లో...

## జంతువుల సంరక్షణ బాధ్యతను
# ప్రతి ఒక్కరు స్వీకరించాలి

**విశాఖ జూ పరిశీలన సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు**





- తల్లిఅంజనాదేవి జన్మదినం సందర్భంగా జిరాఫీలు దత్తత
- ఏడాదిపాటు వాటి పోషణ ఖర్చులు భరిస్తానని ప్రకటన
- విశాఖ జూ పార్క్ ఆద్యంతం పరిశీలించిన పవన్‌కళ్యాణ్
- కంబాలకొండ ఎకో పార్క్లో కెనోపీ వాక్

విశాఖపట్నం, **జనవరి 29 రిపబ్లిక్ న్యూస్.**
పర్యావరణ సమతుల్యత,స్థిరత్వానికి వన్యప్రాణి సంరక్షణ చాలా ముఖ్యమని, ప్రతి ఒక్కరువన్యప్రాణి సంరక్షణలో భాగం కావాలనిమిగతా 2లో...


## వీధికుక్కల సమస్య...
# తీర్పు రిజర్వ్

**వీధి కుక్కల నిర్వహణ... సుప్రీంకోర్టులో విచారణ**

**విచారణలో అన్ని వర్గాల వాదనలు విన్న త్రిసభ్య ధర్మాసనం**

**కుక్కల స్టెరిలైజేషన్ కేంద్రాల సంఖ్యపై తప్పుడు లెక్కలున్నాయని ఆందోళన**

**కుక్కలను షెల్టర్లకు తరలించాలన్న గత ఆదేశాలను సవరించిన ధర్మాసనం**



## కెసిఆర్‌కు
# సిట్ నోటీసులు



**ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం**

**నేటి మధ్యాహ్నం విచారణ చేపడతామని వెల్లడి**

హైదరాబాద్,**జనవరి 29 రిపబ్లిక్ న్యూస్.**
ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత రాష్ట్ర సమితి అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కు సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. నందినగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి అందజేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణ చేస్తామని నోటీసుల్లో పేర్కొన్నారు. వయసు దృష్ట్యా పీఎస్‌కు రావాల్సిన అవసరం లేదని సిట్ పేర్కొంది. ఈ కేసులో ఇటీవల మాజీ మంత్రులు హరీశ్‌రావు,మిగతా 2లో...




## యూజీసీ 2026 నిబంధనలపై
# సుప్రీంకోర్టు స్టే




**యూజీసీ 2026 సమానత్వ నిబంధనలను నిలిపివేసిన సుప్రీంకోర్టు**

**తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు 2012 నిబంధనలే అమల్లో ఉంటాయని ఆదేశం**

**జనరల్ కేటగిరీకి అన్యాయం చేసేలా ఉన్నాయని దాఖలైన పిటిషన్లపై విచారణ**

**ఈ నిబంధనలు సమాజాన్ని విభజించే ప్రమాదం ఉందన్న ధర్మాసనం**

# అశ్రునయనాల మధ్య అజిత్ పవార్ అంత్యక్రియలు

(మొదటి పేజీ తరువాయి)
కేంద్ర మంత్రి అమిత్ షా, బీజేపీ చీఫ్ నితిన్ నబిన్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ శ్రద్ధాంజలి ఘటించారు. తమ అభిమాన నేతకు తుది వీడ్కోలు పలికేందుకు ప్రతిష్ఠాన్ మైదానానికి ప్రజలు పోటెత్తడంతో ఆ ప్రాంతం జనసంద్రాన్ని తలపించింది. ప్రభుత్వ లాంఛనాల నడుమ తండ్రి చితికి ఆయన కుమారుడు నిప్పంటించారు. అజిత్ పవార్‌కు తుది వీడ్కోలు పలుకుతూ ఆయన భార్య సునేత్ర, ఇతర కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. అజిత్ పవార్‌ను కోల్పోయినందుకు పార్టీ నేతలు, అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు. బుధవారం ఉద్యం విమాన ప్రమాదంలో మరణించిన మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎన్సీపీ నేత అజిత్ పవార్ అంత్యక్రియలు బారామతిలోని విద్యా ప్రతిష్ఠాన్ గ్రౌండ్‌లో ప్రభుత్వ లాంఛనాలతో చేపట్టారు. గురువారం ఉదయం ప్రారంభమైన అంతిమ యాత్రలో వేల మంది అభిమానులు పాల్గొన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ఎపి మంత్రి నారా లోకేష్ సహా చాలా మంది ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించారు.బారామతి విమానాశ్రయం దగ్గర జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ (66) మరణించారు. ఈ దుర్ఘటనలో మరో నలుగురు కూడా ప్రాణాలు కోల్పోయారు. అజిత్ పవార్ మృతదేహాన్ని మంగళవారం రాత్రి పుణ్యశ్లోక అహిల్యాదేవి ఆస్పత్రి



నుంచి.. కాటేవాడిలోని ఇంటికి తరలించారు. ఉదయం 9 గంటలకు విద్యా ప్రతిష్ఠాన్ క్యాంపస్ నుంచి అంతిమ యాత్ర మొదలైంది. పూలతో అలంకరించిన రథంలో మృతదేహాన్ని తీసుకెళ్లారు. నగరంలోని ప్రధాన రోడ్ల గుండా ఈ యాత్ర సాగింది. 'అజిత్ దాదా అమర్ రహే' అంటూ అభిమానులు నినాదాలు చేశారు. తర్వాత భౌతికదేహాన్ని విద్యా ప్రతిష్ఠాన్ గ్రౌండ్‌కు చేర్చారు. అక్కడ రాష్ట్ర లాంఛనాలతో అంతిమ సంస్కారాలు జరిగాయి. అజిత్ పవార్ కుమారులు చివరి క్రియలు నిర్వహించారు.



ఈ కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, శరద్ పవార్, సుప్రియా సూలే సహా అన్ని పార్టీల నేతలూ పాల్గొన్నారు. అజిత్ పవార్ మృతి పట్ల ప్రధాని నరేంద్ర మోడి, ఇతర ప్రముఖులు సంతాపం ప్రకటించారు. మరోవైపు విమాన ప్రమాదంపై డీజీసీఏ, ఏఏఐబీ దర్యాప్తు మొదలైంది. బ్లాక్‌బాక్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. దట్టమైన పొగమంచు, విజిబులిటీ తక్కువగా ఉండటమే ప్రమాదానికి కారణమని ప్రాథమిక సమాచారం. ఐతే.. దర్యాప్తు తర్వాత పూర్తి నివేదిక వస్తుంది. అందులో ఏం చెబుతారన్నది తేలాల్సిన అంశం. అజిత్ పవార్ మరణంతో మహారాష్ట్రలో మూడు రోజుల రాష్ట్ర సంతాప దినాలు ప్రకటించారు. ఆయనది ప్రమాద మరణమా, లేక కుట్ర పూరిత హత్యా అనే సందేహాలు ఉన్నాయి. అయితే ఈ అనుమానాలను శరద్ పవార్ తోసిపుచ్చారు.

# యూజీసీ 2026 నిబంధనలపై సుప్రీంకోర్టు స్టే

**యూజీసీ 2026 సమానత్వ నిబంధనలను నిలిపివేసిన సుప్రీంకోర్టు**

**తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు 2012 నిబంధనలే అమల్లో ఉంటాయని ఆదేశం**

**జనరల్ కేటగిరీకి అన్యాయం చేసేలా ఉన్నాయని దాఖలైన పిటిషన్లపై విచారణ**

**ఈ నిబంధనలు సమాజాన్ని విభజించే ప్రమాదం ఉందన్న ధర్మాసనం**

న్యూఢిల్లీ, **జనవరి 29 రిపబ్లిక్ న్యూస్.**
ఉన్నత విద్యా సంస్థల్లో సమానత్వ ప్రోత్సాహం కోసం యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) తీసుకొచ్చిన 2026 నిబంధనల అమలుపై సుప్రీంకోర్టు ఇవాళ మధ్యంతర స్టే విధించింది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకు 2012 నాటి పాత నిబంధనలే అమల్లో



ఉంటాయని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వానికి, యూజీసీకి నోటీసులు జారీ చేసింది.
యూజీసీ కొత్త నిబంధనలు జనరల్ కేటగిరీ విద్యార్థుల పట్ల వివక్ష చూపించేలా ఉన్నాయని, వారికి ఫిర్యాదు చేసే యంత్రాంగాన్ని నిరాకరిస్తున్నాయని ఆరోపిస్తూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై విచారణ చేపట్టిన సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. "మేము జోక్యం చేసుకోకపోతే, ఇది ప్రమాదకరమైన ప్రభావాన్ని చూపుతుంది. సమాజాన్ని విభజిస్తుంది, తీవ్ర పరిణామాలకు దారితీస్తుంది" అని ధర్మాసనం ఈ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది.
కొత్త నిబంధనల ప్రకారం 'కుల ఆధారిత వివక్ష' అనే పదాన్ని కేవలం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకే పరిమితం చేశారని పిటిషనర్లు ఆరోపించారు. దీనివల్ల జనరల్ కేటగిరీకి చెందిన వారికి ఎలాంటి వివక్ష ఎదురైనా ఫిర్యాదు చేసే అవకాశం లేకుండా పోతుందని, ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15(1), 21లను ఉల్లంఘించడమేనని వాదించారు.
పిటిషనర్ల వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, 'సంపూర్ణ న్యాయం' కోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తమకున్న ప్రత్యేక అధికారాలను ఉపయోగించి ఈ నిబంధనలను నిలిపివేస్తున్నట్లు తెలిపింది. అనంతరం తదుపరి విచారణను మార్చి 19వ తేదీకి వాయిదా వేసింది.

# 7.2 శాతానికి జీడీపీ వృద్ధి

(మొదటి పేజీ తరువాయి)
ఆనవాయితీగా వస్తోంది.గత ఆర్థిక సంవత్సరంలో భారత్ సాధించిన అభివృద్ధి, ఎదురైన సవాళ్లు, భవిష్యత్తులో తీసుకోవాల్సిన చర్యలు తదితర కీలక విషయాలను ఆర్థిక సర్వేలో ప్రస్తావిస్తారన్న విషయం తెలిసిందే. 2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత దేశ రియల్ జీడీపీ 6.8 శాతం నుంచి 7.2 శాతం వృద్ధి చెందే అవకాశం ఉందని ఆర్థిక సర్వే తేల్చింది. సుస్థిర దేశీయ డిమాండ్, స్థూల ఆర్థిక అంశాలు సానుకూలంగా ఉండటంతో భారత ఆర్థిక ప్రగతికి ఢోకా లేదని ఆర్థిక సర్వే తేల్చింది. ఈ సర్వే ప్రకారం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పరిస్థితి కాస్త ఆందోళనకరంగానే ఉంది. ప్రతికూల అంశాల ప్రాబల్యం కొనసాగు తోంది. ఫలితంగా ప్రపంచ ఆర్థిక ప్రగతి ఓ మోస్తరు స్థాయిలోనే కొనసాగుతుంది. స్థూలంగా చూస్తే వస్తువుల ధరలు ఈ ఏడాదిలో స్థిరంగా కొనసాగే అవకాశం ఉంది. కృత్రిమ మేధతో ఆశించిన మేర ఆర్థిక ఫలాలు అందకపోతే ఆస్తుల విలువ తరిగి ఆర్థికరంగంపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. భౌగోళిక అనిశ్చితుల కారణంగా పెట్టుబడులపై ప్రతికూల ప్రభావం పడి ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మరింత నెమ్మదించవచ్చు. ప్రస్తుత పరిస్థితి నిలకడగా ఉన్నా రాబోయే రోజుల్లో ప్రతికూలతలు పెరిగి పరిస్థితి వికటించే అవకాశం ఉందని కూడా ఆర్థిక సర్వే అంచనా వేసింది.అమెరికా సుంకాల భారం ఉన్నా భారత ఆర్థిక వ్యవస్థ పరుగులు తీసిందని ఆర్థిక సర్వే తేల్చింది. సుంకాల విధింపు తరువాత జీడీపీ వృద్ధి అంచనాలు తగ్గినా వాస్తవంలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం చేపట్టిన వ్యవస్థాగత మార్పులు, విధానపరమైన నిర్ణయాల కారణంగా సుంకాల భారాన్ని భారత్ తట్టుకోగలిగిందని ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. గత సంవత్సర కాలంలో దేశ ఆర్థిక పనితీరును.. రాబోయే సంవత్సరంలో ఆర్థికంగా ఎదురయ్యే సవాళ్లను ముందుగానే అంచనా వేసి చెప్పేదే ఈ ఎకనామిక్ సర్వే. ఆర్థిక మంత్రిత్వశాఖకు చెందిన ఎకనామిక్ అ÷ర్స్ డిపార్ట్‌మెంట్‌లోని ఎకనామిక్ డివిజన్ ఈ సర్వేను రూపొందిస్తుంది. తొలుత 1950-51 సంవత్సరం నుంచి ఆర్థిక సర్వేను బడ్జెట్ తో పాటే ప్రవేశపెట్టేవారు. 1960 తర్వాత బడ్జెట్‌కు ముందు ప్రవేశపెట్టే సంప్రదాయం మొదలైంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి గానూ.. దేశ జీడీపీ 6.8-7.2 శాతంగా ఉండొచ్చు. గతేడాదితో పోలిస్తే అంచనాలను పెంచింది. 2025-2026కు జీడీపీ అంచనాలను 7.4 శాతం నుంచి తగ్గించింది. ఇటీవల ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.4? వృద్ధి రేటు నమోదుకావొచ్చని గణాంకాలు, పథకాల అమలు మంత్రిత్వశాఖ అంచనా వేసిన సంగతి తెలిసిందే. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు 4.8శాతం. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో అది 4.4 శాతంగా ఉంటుందని సర్వే అంచనా వేసింది. అంతర్జాతీయంగా అనిశ్చితులు కొనసాగుతున్నప్పటికీ.. 2026-2027కు భారత్‌లో స్థిరమైన వృద్ధి నమోదవు తుందని అంచనా వేసింది.వికసిత్ భారత్‌ను సాధించడంలో వ్యవసాయరంగం కీలకపాత్ర పోషిస్తుంది. దేశీయంగా తయారీ, ఎగుమతులు ఎలక్ట్రానిక్ రంగం వృద్ధికి దోహదం చేస్తున్నాయి. ఇందులో మొబైల్ తయారీ కీలకం. పదేళ్లలో ఉత్పత్తి విలువ 30 రెట్లు పెరిగి.. రూ.18వేల కోట్ల నుంచి రూ.5.45 లక్షల కోట్లకు చేరింది. డిజిటల్ సేవల
విషయంలో గ్రామాలు, పట్టణాల మధ్య అంతరం తగ్గుతోంది. ఇటీవల భారత్-ఈయూ మధ్య కుదిరిన ట్రేడ్ డీల్ గురించి ప్రస్తావించింది.

# 2027 కల్లా బెంగళూరు-విజయవాడ ఎకనామిక్ కారిడార్

(మొదటి పేజీ తరువాయి)
రాష్ట్రంలో ప్రస్తుతం చేపట్టిన రూ.1.40 లక్షల కోట్ల విలువైన జాతీయ రహదారుల ప్రాజెక్టులను 2029 నాటికి పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. సరుకు రవాణా వ్యయాన్ని గణనీయంగా తగ్గించడమే లక్ష్యంగా రహదారుల ప్రాజెక్టులు చేపట్టాలని స్పష్టం చేశారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో జాతీయ రహదారులు, ఆర్ అండ్ బీ శాఖల ప్రాజెక్టుల పురోగతిపై చంద్రబాబు సమీక్ష నిర్వహించారు.
శ్రీకాకుళంలోని మూలపేట, విశాఖ, కాకినాడ, మచిలీపట్నం, రామాయపట్నం, కృష్ణపట్నం వంటి ఓడరేవులను జాతీయ రహదారులతో అనుసంధానించాలని సీఎం సూచించారు. పొరుగు రాష్ట్రాల నుంచి కూడా ఈ పోర్టులకు సరుకు రవాణా జరిగేలా రోడ్లను నిర్మించాలని దిశానిర్దేశం చేశారు. ఖరగ్‌పూర్-అమరావతి, నాగ్‌పూర్-విజయవాడ, రాయ్‌పూర్-అమరావతి వంటి కీలకమైన కారిడార్ల డీపీఆర్‌లను త్వరగా సిద్ధం చేయాలని ఆదేశించారు.రాష్ట్రంలో 45 వేల కిలోమీటర్ల రోడ్లపై ఎక్కడా గుంతలు లేకుండా చూడాలని, వేస్ట్ ప్లాస్టిక్, నానో కాంక్రీట్ వంటి ఆధునిక టెక్నాలజీతో రోడ్లు నిర్మించాలని సీఎం స్పష్టం చేశారు. ఈ సమీక్షలో రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, జాతీయ రహదారుల సంస్థ అధికారులు పాల్గొన్నారు.

### 2-లేన్ల రహదారులను 4-లేన్లుగా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

రాష్ట్రంలో రోడ్ నెట్‌వర్క్‌ను మరింత బలోపేతం చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతిలోని తన క్యాంప్ కార్యాలయంలో జాతీయ రహదారుల ప్రాజెక్టులపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం 2 లేన్లుగా ఉన్న జాతీయ రహదారులను 4 లేన్లుగా విస్తరించేందుకు తక్షణమే ప్రణాళికలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో రాష్ట్రంలో జాతీయ రహదారుల నెట్‌వర్క్ విస్తరణ, రాష్ట్ర రహదారుల అభివృద్ధి, రోడ్ డెన్సిటీ పెంపుదల వంటి కీలక అంశాలపై చర్చించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్‌హెచ్ ప్రాజెక్టుల పురోగతిని, కొత్తగా చేపట్టాల్సిన రహదారుల నిర్మాణం గురించి అధికారులతో సమీక్షించారు. ప్రాజెక్టుల అమలులో ఆంధ్రప్రదేశ్ దేశానికే ఒక బెంచ్‌మార్క్‌గా నిలవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. పనుల్లో నాణ్యత, వేగం పాటించాలని స్పష్టం చేశారు.ఈ సమీక్షా సమావేశంలో రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, జాతీయ రహదారుల సంస్థ కు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### గుంటూరు, కుప్పంలో సీఎం చంద్రబాబు పర్యటన...

ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో పర్యటనకు సిద్ధమయ్యారు. గుంటూరు, కుప్పం నియోజకవర్గాల్లో పర్యటించి పలు కీలక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. శుక్రవారం గుంటూరులో పర్యటించిన అనంతరం, మూడు రోజుల పాటు తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా మొత్తం రూ.690 కోట్ల విలువైన అభివృద్ధి పనుల్లో సీఎం పాల్గొంటారు.పర్యటనలో భాగంగా శుక్రవారం ముందుగా గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మాతా శిశు ఆరోగ్య కేంద్ర భవనాన్ని చంద్రబాబు ప్రారంభించనున్నారు. ఉత్తర అమెరికాలో స్థిరపడిన గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థులు (జింకానా) అందించిన రూ.100 కోట్ల భారీ విరాళంతో ఈ భవనాన్ని నిర్మించారు. విశేషమేమిటంటే, 2018లో ఈ భవనానికి చంద్రబాబే శంకుస్థాపన చేయగా, ఇప్పుడు ఆయనే దీనిని ప్రారంభించనున్నారు. ఈ కేంద్రంలో అవసరమైన వైద్య పరికరాలు, ఫర్నిచర్ కోసం రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.27 కోట్లు కేటాయించింది.

# దేశ అభివృద్ధి లక్ష్యంగా నిర్ణయాలు

(మొదటి పేజీ తరువాయి)
ఏ నిర్ణయమైనా తీసుకుంటుందని అన్నారు. ప్రజల అభివృద్ధి సౌభాగ్యాలే లక్ష్యంగా పథకాలు, నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. ఆధునిక సాంకేతికతలో మార్పులకు అనుగుణంగా తామూ మారతామని చెప్పారు. అయితే, ప్రజలకు మేలు చేకూర్చే విధంగా తమ నిర్ణయాలు ఉంటాయని తెలిపారు. ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకుంటూ సాంకేతికతను జోడించి ముందుకు సాగుతామని అన్నారు. ప్రజల స్థానాన్ని సాంకేతికత భర్తీ చేయజాలదని కూడా ప్రధాని స్పష్టం చేశారు. ÷ాష్ట్రపతి ప్రసంగం ప్రజల ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించిందని అన్నారు. ప్రపంచానికి భారత్ ఆశాకిరణమని చెప్పారు. ఇక ఈయూతో వాణిజ్య ఒప్పందంతో కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయని ప్రధాని తెలిపారు. ఈ ఒప్పందం నుంచి భారత పారిశ్రామిక వర్గాలు లబ్ధిపొందాలని సూచించారు. నాణ్యమైన ఉత్పత్తులను ఈయూ దేశాలకు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఐరోపా సమాఖ్యతో కుదిరిన స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం గురించి ప్రస్తావించారు. అది శుభసూచికమన్నారు. రీఫార్మ్-పెర్ఫామ్-ట్రాన్స్‌ఫామ్ అంటూ బ్జడెట్ టోన్‌లో మాట్లాడారు. ప్రస్తుతం భారత్ రీఫార్మ్ ఎక్స్‌ప్రెస్‌లో ముందుకెళ్తోందని, ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం లభిస్తోందని చెప్పారు. అలాగే సాంకేతికత మనుషులకు ప్రత్యామ్నాయం కాదని మోదీ అన్నారు. రాష్ట్రపతి ప్రసంగం ప్రజల ఆత్మవిశ్వాసాన్ని ప్రతిబింబించింది. ప్రపంచానికి భారత్ ఆశాకిరణం. అన్నిరంగాల్లో అభివృద్ధి దిశగా భారత్ దూసుకెళ్తోంది. వికసిత్ భారత్ కోసం ఎంపీలు కృషి చేయాలి. పెండింగ్ సమస్యలకు పరిష్కారాలు లభిస్తుండటంతో భారత్‌ను సుస్థిరదేశంగా ప్రపంచం చూస్తోంది. ట్రేడ్‌డీల్‌తో కొత్త మార్కెట్ అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. వాటినుంచి తయారీదారులు లబ్ధి పొందాలని కోరుతున్నాను. ఈయూలోని 27 దేశాలకు నాణ్యమైన ఉత్పత్తులు అందించాలని పేర్కొన్నారు. మనం టెక్నాలజీతో పోటీపడతాం. దానిని అందిపుచ్చుకుంటాం. దాని సామర్థ్యాన్ని అంగీకరిస్తాం. అయితే అది మనుషులను భర్తీ చేయలేదని అన్నారు.

# వీధికుక్కల సమస్య...తీర్పు రిజర్వ్

**వీధి కుక్కల నిర్వహణ... సుప్రీంకోర్టులో విచారణ**

న్యూఢిల్లీ**జనవరి 29 రిపబ్లిక్ న్యూస్.**
దేశవ్యాప్తంగా వీధి కుక్కల నిర్వహణ, ప్రజల భద్రతకు సంబంధించిన సుమోటో కేసులో సుప్రీంకోర్టు తన తీర్పును రిజర్వ్ చేసింది. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రం, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ భారత జంతు సంక్షేమ బోర్డు సహా అన్ని వర్గాల వాదనలను సుదీర్ఘంగా విన్న తర్వాత జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన ధర్మాసనం గురువారం ఈ నిర్ణయం తీసుకుంది. వారం రోజుల్లోగా తమ లిఖితపూర్వక వాదనలను సమర్పించేందుకు అన్ని పక్షాలకు సమయం ఇచ్చింది.విచారణ సందర్భంగా, వీధి కుక్కల స్టెరిలైజేషన్ కేంద్రాల లెక్కల్లో భారీ వ్యత్యాసాలు ఉన్నాయని జంతు సంక్షేమ బోర్డు కోర్టు దృష్టికి తెచ్చింది. దేశవ్యాప్తంగా గుర్తింపు పొందినవి 76 కేంద్రాలు మాత్రమే ఉండగా, రాష్ట్ర ప్రభుత్వాలు మాత్రం 883 ఉన్నాయని నివేదికలు సమర్పించాయని తెలిపింది. ఈ లెక్కల్లోని తేడాలపై, నిధుల వినియోగంపై ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. గుర్తింపు కోసం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలని జంతు సంక్షేమ బోర్డును ఆదేశించింది.ఈ సుమోటో విచారణలో భాగంగా కుక్కల ప్రేమికులు, కుక్కకాటు బాధితులు, జంతు హక్కుల కార్యకర్తల వాదనలను కూడా కోర్టు పరిగణనలోకి తీసుకుంది. యానిమల్ బర్త్ కంట్రోల్ (ాదీజ) నిబంధనల అమలు, ప్రజల భద్రత, కుక్కల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించడం వంటి అంశాలపై ఈ కేసు దృష్టి సారించింది.గతంలో, 2025 ఆగస్టులో జస్టిస్ జె.బి. పార్దీవాలా నేతృత్వంలోని మరో ధర్మాసనం ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో వీధి కుక్కలన్నింటినీ వెంటనే పట్టుకుని షెల్టర్లకు తరలించాలని కఠిన ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఆ తీర్పుపై తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రస్తుత త్రిసభ్య ధర్మాసనం ఆ ఉత్తర్వులను సవరించింది. కుక్కలను తరలించే బదులు, ాదీజ నిబంధనల ప్రకారం వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేసి తిరిగి అవే ప్రాంతాల్లో వదిలిపెట్టాలని స్పష్టం చేసింది. తాజాగా వాదనలు ముగియడంతో తుది తీర్పుపై ఉత్కంఠ నెలకొంది.

# కెసిఆర్‌కుసిట్ నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)
కేటీఆర్‌తో పాటు మాజీ ఎంపీ సంతోష్‌రావును సిట్ విచారించిన విషయం తెలిసిందే. ప్రధానంగా ఇప్పటివరకు ఈ కేసుకు సంబంధించి మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు, మాజీ ఎంపీ సంతోష్ రావులను సిట్ విచారించిన విషయం తెలిసిందే. తాజాగా.. కేసీఆర్‌నూ విచారించాలని సిట్ నిర్ణయించింది. ఇందులో భాగంగానే విచారణ చేపట్టేందుకు సిట్ అధికారులు సన్నద్ధమైనట్టు సమాచారం. రెండేళ్లుగా సాగుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు తుది అంకానికి చేరుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే సిట్‌ను పూర్తిగా ప్రక్షాళన చేసి.. సీపీ సజ్జనార్ నేతృత్వంలో మార్పులు చేర్పులు చేశారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన పోలీస్ అధికారులను విచారించి, వారిని రిమాండ్‌కు తరలించారు. ఆ తరువాత ఫోన్ ట్యాపింగ్‌లో బాధ్యులుగా ఉన్నవారిని విచారించి వారి నుంచి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. ఈ కేసులో భాగంగా.. మాజీ ముఖ్యమంత్రిని సిట్ అధికారులు విచారించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే కేసీఆర్ ఈ విచారణకు హాజరవుతారా? లేదా? అనేది ఉత్కంఠగా మారింది.

---

# చెవిరెడ్డికి బెయిల్

(మొదటి పేజీ తరువాయి)
వెళ్లకూడదని ఆదేశించింది. అదే విధంగా బ్యాంక్ అకౌంట్లకు సంబంధించి కూడా పలు కీలక ఆదేశాలు జారీ చేసింది హైకోర్టు. ఈ షరతులకు సంబంధించి పూర్తి వివరాలు అందాల్సి ఉంది. ఇక ఈ కేసులో ఇప్పటికే ఐదుగురికి బెయిల్ మంజూరు అయిన విషయం తెలిసిందే. ఇందులో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఓఎస్డీగా ఉన్న కృష్ణమోహన్ రెడ్డి, జగన్ సెక్రెటరీగా ఉన్న ధనుంజయ్ రెడ్డితో పాటు భారతీ సిమెంట్స్ డైరెక్టర్ బాలాజీ గోవిందప్ప, రాజంపేట ఎంపీ అవినాశ్ రెడ్డి సహా మరొకరికి బెయిల్ వచ్చింది. తాజాగా మరో ముగ్గురికి కూడా బెయిల్ లభించింది. దీంతో ఈ కేసులో మొత్తం ఎనిమిది మందికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. దాదాపు వంద రోజుల తర్వాత సజ్జల శ్రీధర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్ నాయుడులకు బెయిల్ ఇవ్వడంతో పాటు పలు షరతులను హైకోర్టు విధించింది.

# జంతువుల సంరక్షణ బాధ్యతను ప్రతి ఒక్కరు స్వీకరించాలి

(మొదటి పేజీ తరువాయి)రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి,అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు నిచ్చారు.తన తల్లి అంజనా దేవి జన్మదినాన్ని పురస్కరించుకొని విశాఖఇందిరాగాంధీ జూలాజికల్ పార్క్ రెండు జిరాఫీలను పవన్‌దత్తత తీసుకున్నారు. ఏడాదిపాటు వాటి సంరక్షణకు అయ్యేఖర్చును భరించనున్నట్టు ప్రకటించారు. గురువారం ఉదయంవిశాఖ పర్యటనలో భాగంగా ఇందిరాగాంధీ జూ పార్కును పవన్ కళ్యాణ్ పరిశీలించారు. జూ పార్క్ జంతువుల సంరక్షణ నిమిత్తం ప్రస్తుతం ఏర్పాటు చేసిన సౌకర్యాలకు సంబంధించి వివరాలుఅడిగి తెలుసుకున్నారు. జూపార్క్ను మరింత అభివృద్ధిచేసేందుకుఉన్న అవకాశాలపై అటవీశాఖ అధికారులతో ఆయన చర్చించారు.ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "మన దేశంలోవన్యప్రాణుల సంరక్షణ అంశంలో జూపార్కులు చాలా ముఖ్యపాత్ర పోషిస్తున్నాయన్నారు. అంతరించిపోతున్న జీవ జాతులనురక్షిస్తున్నాయని, ప్రశాంతమైన వాతావరణంలో సుమారు 650
అంతకు ముందు విశాఖ ఇందిరా గాంధీ జూలాజికల్ పార్కునుపవన్ కళ్యాణ్ పరిశీలించారు. మొదట జూ వెనుక గేటుకిసమీపంలో ఉన్న సీతాకోక చిలుకల పార్కును సందర్శించారు.పార్కులో ఎన్ని రకాల సీతాకోక చిలుకలు ఉన్నాయి? వలల మధ్యఉన్న వాటికి ఆహారం ఎలా అందిస్తారు? తదితర వివరాలు జూక్యూరేటర్ మంగమ్మను అడిగి తెలుసుకున్నారు. అటవీశాఖఎకరాల విస్తీర్ణంలో ఉన్న విశాఖ జూపార్క్ లో వందలాది వన్యప్రాణులు, పక్షులు ఆహ్లాదకర వాతావరణం మధ్య జీవిస్తున్నాయన్నారు. వాటి సంరక్షణ మనందరి బాధ్యత అని, అయితే జూ పార్కులఅభివృద్ధిలో కార్పొరేట్లు భాగస్వాములు కావాలని పవన్ కళ్యాణ్‌పిలుపునిచ్చారు. తమకు నచ్చిన జంతువును ఎంచుకొని వాటిసంరక్షణ బాధ్యత తీసుకోవాలన్నారు. తమ కుటుంబం మొత్తంజంతు ప్రేమికులమని. జంతు సంక్షణపై చాలా శ్రద్ధపెడతారని,తమ ఇంట్లో నాలుగు కుక్కలను పెంచుతున్నామన్నారు.జూలో నూతనంగా ఎలుగుబంట్ల కోసం ఏర్పాటు చేసిన ఎన్‌క్లోజర్ ను పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. జూలో ఉన్న రెండు నల్లఎలుగుబంట్ల వివరాలు తెలుసుకుని, వాటికి ఆహారంఅందించారు. జింకలపార్క్, జూలో ఉన్న సింహాలు, ఆఫ్రికన్‌మకావు జాతి చిలుకలు, పులులను తిలకించారు. వారి రక్షణకుతీసుకుంటున్న చర్యలు, జూలో ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలపైచర్చించారు. జూపార్క్ లోని ఏనుగులశాలను సందర్శించారు. జూనిబంధనలు పాటిస్తూ శానిటైజ్ చేసుకుని ఏనుగుల వద్దకు వెళ్లివాటికి ఆహారం అందించారు. అనంతరం జూ పార్క్ లో ఉన్నజిరాఫీల ఎంక్లోజర్ వద్దకు వెళ్లారు.అధికారులు బటర్ ఫ్లై పార్క్ వదిలేందుకు సేకరించిన వివిధరకాల సీతాకోక చిలుకలను పవన్ కళ్యాణ్ పార్కులోకి విడుదలచేశారు. టైగర్ రకానికి చెందిన సీతాకోక చిలుకలు ఆయన దుస్తులపై వాలగా, వాటిని సున్నితంగా పూల మొక్కలపైకి మళ్లించారు.అనంతరం జూ పార్క్ ఉన్న నీటి ఏనుగులను పరిశీలించారు.వాటికి ఇచ్చే ఆహారం, జూ అధికారులు వాటికి పెట్టిన పేర్లు, సంరక్షణలో తీసుకుంటున్న జాగ్రత్తలు తదితర వివరాలు అడిగితెలుసుకున్నారు.ఆకులు, అరటి పండ్లు ఆహారంగా అందించారు. జిరాఫీలనుఎక్కడి నుంచి తీసుకువచ్చారు? వాటి వయస్సు ఎంత? తదితరవివరాలు సంరక్షకులను అడిగి తెలుసుకున్నారు.

# టెలికామ్ వినియోగదారులకు మెరుగైన సేవలే ట్రాయ్ లక్ష్యం

**-ట్రాయ్ కాగ్ సభ్యులు బత్తుల సంజీవరాయుడు**






**పాములపాడు , జనవరి 29, రిపబ్లిక్ న్యూస్ ; --**
టెలికామ్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే ట్రాయ్ లక్ష్యమని ట్రాయ్ కాగ్ సభ్యులు డాక్టర్ బత్తుల సంజీవరాయుడు తెలిపారు. పులివెందలలోని ఎస్పీ మహిళ డిగ్రీ కళాశాలలో టెలికం వినియోగదారుల అవగాహన సదస్సు పిఎస్ఎస్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెలికామ్ నియంత్రణ ప్రాధికార సంస్థ ట్రాయ్ ప్రధాన బాధ్యతల్లో సెల్ వినియోగదారుల ప్రయోజనాలను సంరక్షించడం ఒకటి అన్నారు. మెరుగైన టెలికామ్ సేవలు అందించడం కోసం సెల్ కంపెనీలు అయిన జియో, ఎయిర్టెల్ , బిఎస్ఎన్ఎల్ , వోడాఫోన్ మొదలగు కంపెనీల సేవలపై నిబంధనలు , ఆదేశాలు , పర్యవేక్షణ ఎప్పటికప్పుడు ఉత్తర్వులను జారీ చేస్తుందని పేర్కొన్నారు. టెలికామ్ రంగంలో అమలు చేసిన ఆర్థిక సంస్కరణల ద్వారా 110 కోట్ల మంది వినియోగదారులు మనదేశంలో మెరుగైన సేవలు ట్రాయ్ ద్వారా పొందుతున్నారన్నారు. వివిధ టెలికామ్ సేవలు మరియు కేబుల్ టీవీ సేవలు నాణ్యతా ప్రమాణాలను సమర్ధవంతంగా రూపొందించి వాటిని పటిష్టంగా అమలు చేయటానికి కేంద్ర ప్రభుత్వం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా ట్రాయ్ అనే స్వతంత్ర నియంత్రణ సంస్థను రూపకల్పన చేసి అమలులోకి తెచ్చిందని చెప్పారు. అంతేకాక ట్రాయ్ నిబంధనల ప్రకారము, టారిఫ్ సిస్టం , వ్యాపార ప్రకటనల నిశిద్ధం , సేవల నాణ్యత ప్రమాణాలు , మొబైల్ నంబర్ పోర్టబుల్టి , సౌకర్యం విలువతో కూడిన సేవలు, రక్షణ , వినియోగదారుల హక్కులు మరియు మొబైల్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే ట్రాయ్ ఆవిర్భావ ఆశయం అన్నారు. ప్రస్తుత టారిఫ్ ఇతర కంపెనీల కంటే తక్కువగా బిఎస్ఎన్ఎల్ ఉండడమే కాక బిఎస్ఎన్ఎల్ లో కూడా 4 జీ సేవలు రావడం ద్వారా వినియోగదారులు బిఎస్ఎన్ఎల్ వైపు చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, బిఎస్ఎన్ఎల్ వెంకటేశ్వర్లు, జెటిఓ , నంద్యాల జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షులు అమీర్ భాష , అడ్వకేట్ రఘురామిరెడ్డి , బ్రహ్మానంద ఆచారి, నార్ల ప్రకాశం , ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిబ్బంది బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి , ఎన్జీవో వెంకటేశ్వర్లు విద్యార్థినిలు పాల్గొన్నారు

# ప్రజాసేవలో వినయం కీలకం

**విధి వేళల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలి**

**నగరపాలక సంస్థ మేనేజర్ యన్. చిన్నరాముడు -నగరపాలక సంస్థ,**



**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జనవరి 29)**నగరపాలక సంస్థకు వచ్చే ప్రజలతో వినయంగా వ్యవహరించడం, ప్రతి దరఖాస్తును సహనంతో పరిశీలించడం అత్యంత కీలకమని నగరపాలక సంస్థ మేనేజర్ యన్. చిన్నరాముడు అన్నారు.గురువారం నగరపాలక కార్యాలయంలోని జననమరణ ధ్రువీకరణ పత్రాల జారీ విభాగాన్ని ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు దస్త్రాలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడంతో పాటు విధి వేళల్లో తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. నగరపాలక సంస్థకు మంచి పేరు తీసుకొచ్చేలా ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆయన స్పష్టం చేశారు.

# రోగి ప్రాణ రక్షణే వైద్య వృత్తి యొక్క ప్రధాన ధర్మం

**గుడ్ క్లినికల్ ప్రాక్టీసెస్, మెడికల్ ఎథిక్స్ తప్పనిసరి అడిషనల్ డీఎంఈలు డా. చిట్టి నరసమ్మ, డా. వెంకటేశ్వర్లు**







**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జనవరి 29)**
వైద్య వృత్తిలో రోగి ప్రాణాలను కాపాడటమే అత్యున్నత ధర్మమని, ఇందుకోసం గుడ్ క్లినికల్ & ల్యాబొరేటరీ ప్రాక్టీసెస్‌ను తప్పనిసరిగా పాటించాలని అడిషనల్ డీఎంఈలు, కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ మరియు హాస్పిటల్ సూపరింటెండెంట్లు డా. కే. చిట్టి నరసమ్మ, డా. వెంకటేశ్వర్లు అన్నారు.

గురువారం కర్నూలు వైద్య కళాశాలలోని న్యూ లెక్చరర్ గ్యాలరీలో పీజీ, సూపర్ స్పెషాలిటీ వైద్య విద్యార్థుల కోసం ఎంసీఐ నిబంధనల మేరకు మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణా కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు.వైద్యులు తమ కుటుంబ సభ్యులకు ఎంత జాగ్రత్తగా వైద్యం చేస్తారో అదే శ్రద్ధను ప్రతి రోగి విషయంలోనూ చూపాలని, ప్రతి రోగికి సంబంధించిన వైద్య సమాచారాన్ని స్పష్టంగా తెలియజేయడంతో పాటు వారి సమ్మతిని తీసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. శాస్త్రీయ ఆధారాలపై ఆధారపడి చికిత్స నిర్వహించడం, చికిత్సకు సంబంధించిన పూర్తి వివరాలను మెడికల్ రికార్డుల్లో భద్రపరచడం తప్పనిసరి అని సూచించారు.

ల్యాబొరేటరీ పరీక్షల ఖచ్చితత్వం ఉపయోగిస్తున్న నాణ్యమైన రీఏజెంట్లు, పరికరాలు మరియు సాంకేతిక సిబ్బందిపై ఆధారపడి ఉంటుందని, వాటిని ఎప్పటికప్పుడు పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. ఇలాంటి శిక్షణల ద్వారా వైద్యులు తమ వృత్తి పరమైన బాధ్యతలను మరింత నిబద్ధతతో నిర్వహించేందుకు అవకాశం కలుగుతుందన్నారు.

ఈ సందర్భంగా ఏపీ మెడికల్ కౌన్సిల్ ప్రతినిధి, సీటీవీఎస్ విభాగాధిపతి డాక్టర్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ వైద్య వృత్తి అనేది సేవతో కూడిన గొప్ప బాధ్యత అని పేర్కొన్నారు. లాభనష్టాల ప్రభావం లేకుండా రోగికి ఏది మేలో ఆ నిర్ణయాలు తీసుకోవడమే మెడికల్ ఎథిక్స్ యొక్క మూల సూత్రమని వివరించారు.

ఈ శిక్షణా కార్యక్రమం ఎంఈయూ కోఆర్డినేటర్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సింధియా శుభప్రద ఆధ్వర్యంలో నిర్వహించబడుతోంది. కార్యక్రమంలో ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ రాజేష్, కమ్యూనిటీ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

# పుంగనూరు రూరల్ సిఐగా బాధ్యతలు స్వీకరించిన సాయి ప్రసాద్




**చౌడేపల్లి ప్రతినిధి జనవరి 29 రిపబ్లిక్ న్యూస్**
పుంగనూరు రూరల్( చౌడేపల్లి) సర్కిల్ ఇన్స్పెక్టర్ గా సాయి ప్రసాద్ నియమితులయ్యారు. గురువారం ఈ మేరకు ఆయన స్థానిక పోలీస్ స్టేషన్లో తన ఛాంబర్ నందు బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న రాంభూపాల్ అనంతపురం వి ఆర్ కు బదిలీ కాగా అదే జిల్లా తాడిపత్రిలో పనిచేస్తున్న సాయి ప్రసాద్ ఇక్కడికి నియమితులయ్యారు. న్యాయం కోసం వచ్చే బాధితులకు ప్రాధాన్యత ఇస్తానని చట్టపరంగా వారికి రక్షణ కల్పిస్తానని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ ను ప్రోత్సహిస్తానని అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కు పాదం మోపుతానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.ఎస్సై నాగేశ్వరరావు, సోమల మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడులు నూతనంగా బాధ్యతలు చేపట్టిన సర్కిల్ ఇన్స్పెక్టర్ సాయి ప్రసాద్ ను సన్మానించారు.

# గడ్డి మందు తాగి యువకుడి ఆత్మహత్య

**చౌడేపల్లి ప్రతినిధి జనవరి 29 రిపబ్లిక్ న్యూస్**
ఆర్థిక ఇబ్బందులతో గడ్డి మందు తాగి యువకుడు మృతి చెందిన సంఘటన చౌడేపల్లి మండలంలో చోటుచేసుకుంది. నాగేశ్వరరావు కథనం మేరకు... చౌడేపల్లి పరిధిలోని చిట్రెడ్డిపల్లి కి చెందిన సతీష్ 25 పుంగనూరులో ఉంటూ ఓ ప్రైవేటు పాల కంపెనీలో సాంకేతిక నిపుణుడిగా పనిచేసేవాడు. సొంత గ్రామమైన చిట్రెడ్డిపల్లిలో గృహాన్ని నిర్మిస్తున్నాడు.ఈ క్రమంలో రుణాలు అధికంగా చేయడంతో ఆర్థిక భారం అధికమైంది. దీంతో సతీష్ తానా ఇండ్లు సమీపంలోని సచివాలయం వెనుక భాగంలో గడ్డి ముందు సేవించాడు మందు తాగిన తర్వాత అతని స్నేహితునికి తాను ఎక్కడున్నానో తెలిపి గడ్డి మందు తాగానని రక్షించాలని ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు.వెంటనే అతని స్నేహితుడు కుటుంబ సభ్యులతో వెళ్లి అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అక్కడ సతీష్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో బెంగళూరుకు తరలించారు. మార్గమధ్యంలో మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు మృతుని తండ్రి రెడ్డి శేఖర్ ఫిర్యాదు పై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై వివరించారు.


సతీష్ (ఫైల్ ఫోటో)

# బంగారు ఆభరణాలతో ప్రయాణాలు
# మహిళలు అప్రమత్తంగా ఉండాలి

**బస్సులు, రైళ్లలో కేటుగాళ్ల ముప్పు -జిల్లా ప్రజలకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచనలు**







**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జనవరి 29)**
మహిళలు బంగారు ఆభరణాలు ధరించి ప్రయాణించే సమయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ విజ్ఞప్తి చేశారు. గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన ఈ సూచనలు చేశారు.ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో బస్టాండ్లు, బస్సుల్లో రద్దీ పెరిగిందని, ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కేటుగాళ్లు దొంగతనాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా బస్సులు ఎక్కే, దిగే సమయంలో జరిగే తోపులాటలో మహిళల బంగారు ఆభరణాలను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలు జరుగుతున్నాయని హెచ్చరించారు.

కేటుగాళ్లు కూడా టికెట్ తీసుకుని ప్రయాణికుల్లాగే బస్సుల్లో ప్రయాణిస్తూ, ముందుగానే టార్గెట్ చేసిన వ్యక్తుల కదలికలను గమనిస్తారని చెప్పారు. సరైన సమయం చూసి బ్యాగులు, లగేజీలు లేదా మెడలోని బంగారు ఆభరణాలను అపహరిస్తారని వివరించారు. ప్రయాణాల్లో చుట్టుపక్కల పరిస్థితులను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని, అపరిచితులను నమ్మి తమ వస్తువులపై బాధ్యత అప్పగించకూడదని ఎస్పీ సూచించారు. అలాగే తెలియని వ్యక్తులు ఇచ్చే తినుబండారాలను తీసుకోవద్దని, ఎక్కువ పరిచయం పెంచుకుని మాట్లాడినా నమ్మకూడదన్నారు.

**మహిళలు తప్పనిసరిగా పాటించాల్సిన జాగ్రత్తలు :**
ప్రయాణ సమయంలో వీలైనంతవరకు బంగారు ఆభరణాలు ధరించకపోవడం ఉత్తమం.
బస్సుల్లో సీట్ల కోసం హడావుడిగా ఎక్కేటప్పుడు తోపులాటకు దూరంగా ఉండాలి.అపరిచితులపై నమ్మకం పెట్టి బ్యాగులు, లగేజీలను చూడమని చెప్పి వెళ్లకూడదు.రైలు, బస్సు ప్రయాణంలో కిటికీల వద్ద కూర్చోవద్దు.కిటికీ వద్ద కూర్చోవాల్సి వస్తే మెడలోని ఆభరణాలను చీర లేదా స్కార్ఫ్‌తో కప్పుకోవాలి.చిన్నపాటి జాగ్రత్తలు పాటించడం ద్వారా చోరీలను నివారించవచ్చని ఎస్పీ తెలిపారు. నేరాల నివారణకు జిల్లా ప్రజలు పోలీసులకు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు కన్పిస్తే వెంటనే డయల్ 112 లేదా 100 కు సమాచారం ఇవ్వాలని కోరారు.బంగారం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో మహిళలు మరింత అప్రమత్తంగా ఉండాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# వేణుగోపాలస్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి పూజలు

**చౌడేపల్లి ప్రతినిధి**
**జనవరి 29 రిపబ్లిక్ న్యూస్**
స్థానిక రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని ఆలయంలో ఉదయాన్నే ప్రధానార్చకుడు వశిష్టాచార్యులచే స్వామి అమ్మవార్లకు విశేష అభిషేకము అలంకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి ఉదయం నుంచి సాయంత్రం వరకు వేణుగోపాలస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులకు పవిత్ర తీర్థప్రసాదాలు అందించారు.



# తల్లి కష్టానికి నేడు ఫలితం

## గ్రూప్స్ పరీక్షలో ప్రతిభ చూపి ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ ఎస్సైగా తెలుగు గురుమూర్తి ఉద్యోగం



**ఓర్వకల్లు ప్రతినిధి, జనవరి 29, (రిపబ్లిక్ న్యూస్)**

కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం కాల్వ బుగ్గ గ్రామానికి చెందిన తెలుగు రామేశ్వరమ్మ రోజువారీ కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించిన ఓ నిరుపేద తల్లి కష్టానికి నేడు తగిన ఫలితం దక్కింది. చిన్న తనం లోనే తండ్రి అనారోగ్యంతో మృతి చెందగా ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాలని పట్టుదలతో తెలుగు గురుమూర్తి గ్రూప్స్ పరీక్షల్లో ప్రతిభ చూపి ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్సై)గా ఉద్యోగం సాధించాడు. పేదరికం, ఆర్థిక ఇబ్బందులు, అనేక అవరోధాలు ఎదురైనా కుమారుడి చదువుపై నమ్మకం కోల్పోని తల్లి తన శ్రమ ఫలించడంతో కన్నీళ్లతో ఆనందం వ్యక్తం చేశారు. కూలి పనికి వెళ్లి వచ్చిన ప్రతి రూపాయిని కుమారుడి విద్యకే ఖర్చు చేస్తూ, అతడిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలన్న సంకల్పంతో ముందుకు సాగిన తల్లి త్యాగం నేడు అందరికీ ఆదర్శంగా నిలిచింది. ఈ ఘటన గ్రామ యువతకు స్ఫూర్తిగా నిలుస్తూ, తల్లిదండ్రుల త్యాగం ఎంత గొప్పదో మరోసారి గుర్తుచేస్తుందని స్థానిక పెద్దలు అభిప్రాయపడ్డారు

# మహిళల భద్రతే లక్ష్యం

## కర్నూలు జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలు








**కర్నూలు క్రైమ్ ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జనవరి 29)**

మహిళల భద్రత, రక్షణను ప్రధాన లక్ష్యంగా చేసుకుని కర్నూలు జిల్లా పోలీసులు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు, సచివాలయ మహిళా పోలీసులతో కలిసి జిల్లావ్యాప్తంగా సమావేశాలు నిర్వహించారు.

ఈ కార్యక్రమాల భాగంగా ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలను సందర్శించి మహిళలు, బాలికలకు భద్రతపై అవగాహన కల్పించారు. మహిళల రక్షణకు తీసుకుంటున్న పటిష్ట చర్యలు, పోలీస్ సేవల గురించి వివరించారు. విద్యార్థినులకు సైబర్ నేరాలు, సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు, శక్తి యాప్ వినియోగంపై స్పష్టమైన అవగాహన అందించారు. ఎక్కడైనా సమస్యలు ఎదురైతే భయపడకుండా డయల్ 100, 112, 1930 వంటి హెల్ప్‌లైన్ నంబర్లకు లేదా స్థానిక పోలీసులను సంప్రదించాలని సూచించారు.

ఈవ్‌టీజింగ్, అనుమానాస్పద ఘటనలు ఎదురైన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని విద్యార్థులకు సూచించారు. నేర నివారణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. మహిళలు, బాలికలు తమ సమస్యలను నేరుగా పోలీసులకు తెలియజేస్తే వెంటనే స్పందించి రక్షణ కల్పిస్తామని పోలీసులు భరోసా ఇచ్చారు.

# అన్ని వర్గాల హక్కుల పరిరక్షణ కోసం పోరాటం చేస్తాం

**పీహెచ్ పీఎస్ మన్నెపాకుల మాధవ హెచ్చరిక**

**మహిళల పై జరిగే దాడులను వ్యతిరేకిస్తాం**

**9వ ఆవిర్భావ దినోత్సవ కరపత్రాలు ఆవిష్కరణ**



**అనంతపురం ప్రతినిధి, జనవరి 29, (రిపబ్లిక్ న్యూస్):**

నగరంలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆల్ ఇండియా ప్రజాసేన హక్కుల పోరాట సమితి 9వ ఆవిర్భావ దినోత్సవ కరపత్రాలను ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గారికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

**బలహీన వర్గాల సమస్యలపై అలుపెరగని పోరాటం**

ఈ సందర్భంగా ఆల్ ఇండియా ప్రజాసేన హక్కుల పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ 2018 సంవత్సరంలో స్థాపితమైన ఆల్ ఇండియా ప్రజాసేన హక్కుల పోరాట సమితి నాయకత్వాన్ని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ క్రిస్టెన్ ఓసి తదితర అన్ని వర్గాల హక్కుల పరిరక్షణ కోసం, మహిళల,

చిన్న పిల్లలపైన పైన జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలను ఖండిస్తూ వ్యతిరేకిస్తూ నిరంతరం పోరాటం చేస్తోందని తెలిపారు. అందులో భాగంగా బడుగు బలహీన వర్గాల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్న ఆల్ ఇండియా ప్రజాసేన హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు మన్నెపాకుల మాధవ్ నాయకత్వంలో ఈ 9వ వార్షికోత్సవం కరపత్రాలు విడుదల చేయడం జరిగిందన్నారు.

**ప్రభుత్వం ఉచితంగా 3 ఎకరాల భూమి ఇవ్వాలి**

రైతులకు పంటలకు గిట్టుబాటు ధరలు, పంట నష్టపరిహారం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా సబ్సిడీలు, ఉచిత బోర్లు, భూమిలేని పేద రైతన్నలకు ప్రభుత్వం ఉచితంగా 3 ఎకరాలు భూమి ఇవ్వాలి, ఇల్లులేని పేదలకు మూడు సెంట్లు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

**ఫిబ్రవరి 8న పి హెచ్ పి ఎస్ 9వ ఆవిర్భావ దినోత్సవం**

నగరంలోని ప్రెస్ క్లబ్‌లో ఆల్ ఇండియా ప్రజాసేన హక్కుల పోరాట సమితి 9వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమం ఫిబ్రవరి 8న నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజాసంఘాల నాయకులు, బడుగు బలహీన వర్గాల నాయకులు, మేధావులు, అన్ని వర్గాల నాయకులు అందరూ కలిసి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా పి హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి అంజి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహులు, జిల్లా గౌరవ అధ్యక్షులు అశోక్ రెడ్డి, గౌరవ ఉపాధ్యక్షులు సాకే



నాగరాజు నగర అధ్యక్షుడు జగదీష్ నాయుడు, నగర గౌరవాధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, నగర గౌరవ ఉపాధ్యక్షులు కరీం భాషా, నగర ప్రధాన కార్యదర్శి ఆదిశేషు, నగర కమిటీ సభ్యులు మసూర్ భాష, రామాంజనేయులు, గట్టు రామాంజనేయులు, సాకే కుళ్లాయప్ప, రఫ్తార్ ఇంచార్జ్ గోపాల్ రెడ్డి, రాప్తాడు ప్రధాన కార్యదర్శి మనోహర, పెద్దన్న, నల్లప్ప, కళ్యాణ్ చక్రవర్తి, రవికుమార్, ఎం.గోపాల్, ఆదన్న శేషు బాబా బక్రీద్ శివ కృష్ణ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ వార్త పత్రిక దినోత్సవం



**గుత్తి జనవరి 29 (రిపబ్లిక్ న్యూస్)**

గుత్తి పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహం నందు గురువారం గుత్తి వర్కింగ్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముందుగా జాతీయ వార్తాపత్రిక దినోత్సవ కార్యక్రమం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు అనంతరం సీనియర్ జర్నలిస్టులు మస్తానప్ప, తన్నీరు శ్రీనివాసులు, గోవిందు,బాచి జర్నలిస్టులు మాట్లాడుతూ ముందుగా ప్రతి ఒక్క జర్నలిస్టులందరికీ జాతీయ వార్తాపత్రిక దినోత్సవ శుభాకాంక్షలు అని, గుత్తి వర్కింగ్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి ఈ కార్యక్రమం నిర్వహించడం శుభ పరిణామం అని, పెద్ద పేపర్, చిన్న పేపర్,యూట్యూబ్, పిడిఎఫ్ అని తేడా లేకుండా వర్కింగ్ జర్నలిస్టులు అందరూ రాబోయే రోజుల్లో కూడ మనమంతా ఇలాగే ఐక్యమత్యంగా ఉండాలని, గుత్తి జర్నలిస్టులకు ఏ సమస్య వచ్చిన మేము ముందు ఉంటామని జర్నలిస్టులు అందరికీ భరోసా ఇచ్చారు. అలాగే మన సమస్యలను పరిష్కరించేందుకు ఈ వేదిక ఎంతగానో ఉపయోగపడుతుందని ఇలాగే ముమ్మందు మరెన్నో సమావేశాలు నిర్వహించి మన సమస్యలను మనం పరిష్కరించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ప్రభుత్వం అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మస్తానప్ప,తన్నీరు శ్రీనివాసులు, గోవిందు,బాచి, రఫీ,పెద్దయ్య, నాగేంద్ర, బాషా,ఓబిలేసు,నిజాముద్దీన్,షెక్షావలి,కెయస్ కె సునీల్,రాజు,భరత్,బాషా,మోహన్ బాబు,నరసింహులు,ఆదినారాయణ, మరియు వర్కింగ్ జర్నలిస్టులందరూ పాల్గొన్నారు.

# జంతు కొవ్వు కల్తీ లేదని సిట్ నిర్ధారణ

**సుప్రీంకోర్టు తీర్పుతో చంద్రబాబుకు చెంపపెట్టు**

**బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు బీసీ రమేష్ గౌడ్**

**ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని ఆ శ్రీవారికి క్షమాపణ చెప్పు**

**అనంతపురం ప్రతినిధి, జనవరి 29, (రిపబ్లిక్ న్యూస్):**

జంతు కొవ్వుతో తిరుపతి వెంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదం కల్తీ వివాదం పై సుప్రీంకోర్టు క్లీన్ చిట్ ఇవ్వడాన్ని హర్షం వ్యక్తం చేస్తూ వైయస్సార్సీపి జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలోవెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టారు. కార్యక్రమంలో శింగనమల సమన్వయకర్త సాకే శైలజనాథ్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయగిరిజమ్మ, సోమశేఖర్ రెడ్డి,నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు బీసీ రమేష్ గౌడ్ మాట్లాడుతూ కోట్ల మంది భక్తులు పవిత్రంగా చూసుకునేటువంటి తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి ప్రసాదాన్ని కూడా కూటమి ప్రభుత్వం భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా జంతువుల కొవ్వుతో కల్తీ జరిగిందని చెప్పడాన్ని నిరసిస్తున్నామన్నారు. గురువారం నగరంలోని శ్రీకంఠం కూడలిలో ఉన్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేకమైన పూజలు చేసి ఇప్పటికైనా కూటమి ప్రభుత్వానికి బుద్ధి తీసుకురావాలని కోరుకున్నామన్నారు. అబద్ధాలు, మోసాలు, కుట్రపూరితమైన రాజకీయాలు చేయటంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పీహెచ్డీ చేస్తే.. కుమారుడు రెడ్బుక్ స్టార్ లోకేష్, అతని పార్ట్నర్ సనాతన స్టార్ పవన్ కళ్యాణ్ వారిద్దరూ కలిసి డబల్ పిహెచ్డి చేశారని, మనతోపాటు ప్రజలందరికీ తెలిసిన విషయమే నన్నారు. కాకపోతే ఇక్కడ మనోభావాలు దెబ్బ తినే విధంగా చివరికి ఇచ్చినటువంటి హామీలు నెరవేర్చలేక, పరిపాలన చేతకాక ఇవాళ చేతులెత్తేసి మతాల పేరుతోనూ, ప్రాంతాల పేరుతోను కుట్రపూరితమైన రాజకీయాలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అందులో భాగంగా మీరు పెట్టిన సిట్ తో పాటు సాక్షాత్తు సిబిఐ అధికారులు కూడా ప్రసాదములో జంతు కొవ్వు కలవలేదని చూపిస్తే ఏ ముఖం పెట్టుకున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ప్రశ్నించారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని సాక్షాత్తు ఆ శ్రీవారికి క్షమాపణ చెప్పి భక్తులకు క్షమాపణ చెప్పకుండా ఇప్పటికి కూడా నిస్సిగ్గుగా మరోపక్క ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకొని ప్రజలను ఇప్పటికి కూడా మభ్యపెడుతున్న ప్రయత్నాలు చేస్తున్నారే కానీ మీ తప్పును తెలుసుకునేటువంటి ప్రయత్నం చేయలేదన్నారు. అందుకే వైఎస్ఆర్సిపి నాయకులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో మీరు చెప్పేటువంటి అబద్ధాలని ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. జగన్ అంటే భయం, కూటమితో మూడు పార్టీలు కలిసి ఇచ్చినటువంటి సూపర్ 6 హామీలతో ఫెయిల్యూరై ఇవాళ జగన్మోహన్ రెడ్డి పై బురదజల్లే రాజకీయాలు చేస్తున్నారని మొండిపడ్డారు. జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో మీరు చేస్తున్నటువంటి కుటిల రాజకీయాలను తిప్పికొట్టే విధంగా సాక్షాత్తు



ఆ వెంకటేశ్వర స్వామిని వేడుకుంటున్నామన్నారు. ఇప్పటికైనా ఆ కూటమి ప్రభుత్వానికి బుద్ధినిచ్చి ప్రజలకు నాలుగు మంచి పనులు చెప్పమని చంద్రబాబు నాయుడుకి వైసిపి నాయకులుగా డిమాండ్ చేస్తున్నామన్నారు.

### హామీలు నెరవేర్చలేక వెంకటేశ్వర స్వామి కూడా వదలరే

**మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి ....**



మాట్లాడుతూ సాక్షాత్తు కలియుగ దేవుడైన తిరుపతి వెంకటేశ్వర స్వామిని అడ్డుపెట్టుకొని రాజకీయాల చేస్తున్నారని తీవ్ర అసంతృప్తి వ్యక్తపరిచారు. కూటమి నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, పవన్ కళ్యాణ్ ముగ్గురికి కూడా సుప్రీంకోర్టు తీర్పుతో కలియుగ దేవుడైన శ్రీవారి హస్తాలతో చంప చెల్లుమనిపించేలా చెంపపెట్టు పడిందన్నారు. ప్రజలందరూ ఇప్పటికైనా అర్థం చేసుకోవాలని, అబద్ధం ఎన్ని రోజులైనా దాగదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని హెచ్చరించారు. అబద్ధాలు చెప్పి ఇచ్చిన హామీలు నెరవేర్చలేక చివరకు వెంకటేశ్వర స్వామి ని రాజకీయాలలోకి వాడుకుంటున్నారంటే సిట్ ద్వారా అదే వెంకటేశ్వర స్వామి పెద్ద గుణపాఠం చెప్పారన్నారు. చంద్రబాబు నాయుడు నూటికి వచ్చిందంటే అబద్ధం ఇచ్చిన ప్రతి ఆమె అబద్ధమని ఎంతసేపు చంద్రబాబునాయుడు వైయస్ జగన్ పై ఆరోపణలు మాత్రమే చేస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి మీద ఆరోపణలు, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో కూడా జగన్ పై ఆరోపణలు చేస్తే వైసీపీ నాయకులే నిరూపించుకోవలసి వస్తోందని ఇది ధర్మమా అని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, నారా లోకేష్, పవన్ కళ్యాణ్ ఈ ముగ్గురికి మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుకున్నారు. నెయ్యి కల్తీ అయిందని చెప్పారే కానీ వాళ్ళ బుద్ధి వాళ్ళ మనసు కల్తీ కాకుండా మరో మారు చంద్రబాబుకు బుద్ధి రావాలని కలుగైవాన్ని కోరారు.

# విద్యాసంస్థలలో వివక్షకు ముగింపు పలకాలి

**ఏఐఎస్ఏ రాష్ట్ర కార్యదర్శి ఎస్.నాగార్జున - ఈక్విటీ నిబంధనలు వెంటనే అమలు చేయాలి**

**ఎస్ కే యు, జేఎన్టీయూ వైస్ ఛాన్సలర్లకు ఏఐఎస్ఏ వినతి**





**అనంతపురం ఎడ్యుకేషన్, నవంబర్ 29, (రిపబ్లిక్ న్యూస్):**

దేశవ్యాప్తంగా ఉన్నత విద్యాసంస్థలలో కొనసాగుతున్న కులాధారిత వివక్షను నిర్మూలించి సమానత్వాన్ని నిర్ధారించేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ప్రకటించిన యు జి సి ఈక్విటి నిబంధనలలు 2026 ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం అనంతపురంలో ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా. రమేష్ బాబు గారికి, జె ఎన్ టి యు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సుదర్శన్ రావు గారికి ఏఐఎస్ఏ నాయకులు వినతిపత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఏ రాష్ట్ర కార్యదర్శి నాగార్జున, జిల్లా అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ, ఈ నిబంధనలు అకస్మాత్తుగా వచ్చినవి కావని, సంవత్సరాల తరబడి విద్యార్థులు, ప్రజాసంఘాలు చేసిన పోరాటాల ఫలితమేనని తెలిపారు. రోహిత్ వేముల, పాయల్ తడ్వీ, దర్శన్ సోలంకీ వంటి విద్యార్థుల మరణాలు విశ్వవిద్యాలయాలలో కొనసాగుతున్న కులాధారిత వివక్ష యొక్క భయంకర వాస్తవాన్ని వెలుగులోకి తీసుకువచ్చాయని 2012లోని యు జి సి మార్గదర్శకాలు పూర్తిగా విఫలమయ్యాయని ఈ సంఘటనలే నిరూపించాయని అన్నారు. కుల వివక్ష వివాదంలో యు సి జి 2026లో ఓ బి సిలను కూడా సమానత్వ రక్షణ పరిధిలోకి తీసుకురావడం ఒక కీలక ముందడుగని ఏఐఎస్ఏ గా భావిస్తున్నామని అలాగే సమాన అవకాశాలు సెంటర్ (ఈ ఓ సి) ఈక్విటీ కమిటీ ఏర్పాటు, 24 గంటల హెల్ప్‌లైన్, ఈక్విటీ స్క్వాడ్స్ వంటి వ్యవస్థలను ప్రవేశపెట్టాలని అయితే, ఈ నిబంధనల్లో ఇంకా అనేక లోపాలు ఉన్నాయని ఏఐఎస్ఏ విమర్శించింది. ఈక్విటి కమిటీలలో అణగారిన వర్గాలకు తగిన ప్రాతినిధ్యం లేకపోవడం, కమిటీ చైర్‌పర్సన్‌గా యూనివర్సిటీ అధిపతినే నియమించడం వల్ల స్వార్థపూరిత ప్రయోజనాల ఘర్షణ ఏర్పడే ప్రమాదం ఉందన్నారు దీని వల్ల న్యాయం జరిగే అవకాశాలు దెబ్బతినే ప్రమాదం ఉందని 2019 నుంచి 2024 మధ్య కాలంలో కులాధారిత వివక్షపై ఫిర్యాదులు 118 శాతం పెరిగినట్లు యు జి సి గణాంకాలు సూచిస్తున్న నేపథ్యంలో, ఈ నిబంధనలను కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన అవసరం ఉందని ఏఐఎస్ఏ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసా జిల్లా నాయకులు బాలకృష్ణ జిల్లా ఉపాధ్యక్షులు భీమేష్,ఐసా గణేష్,వంశీ,సురేష్, నరేష్ ,షోహెల్,బాషా, లక్ష్మణ్ నాయక్,ఎస్కె యూనివర్సిటీ నాయకులు రాజు, కృష్ణ మనోహర్,యామన్న,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సాల బసయ్య తాత రథోత్సవ వేడుకలు

## ఉత్సవాల్లో పాల్గొన్న టీడీపీ ఇంచార్జ్ సోదరులు, తనయులు.







**మంత్రాలయం, జనవరి, 29,(రిపబ్లిక్ న్యూస్):** మండలం మాధవరం గ్రామంలో మంత్రాలయం నియోజకవర్గం తెలుగుదేశం ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్ర రెడ్డి స్వగ్రామంలో నిర్వహించిన సాల బసయ్య తాత రథ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ పవిత్ర రథోత్సవం లో మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి సోదరులు, మాధవరం మాజీ సర్పంచ్ శ్రీ రఘునాథ్ రెడ్డి , యువ నాయకులు ఎన్. రాజారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.గ్రామ సంప్రదాయాలు, ఆచారాలకు టీడీపీ నాయకత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, గ్రామ దేవతల ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.అలాగే ఈ ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు.ఉత్సవాల సందర్భంగా



గ్రామ పెద్దలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనగా, కార్యక్రమం భక్తి వాతావరణంలో శోభాయమానంగా కొనసాగింది.

# కాల్వబుగ్గ పుణ్యక్షేత్రం మహాశివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన పాణ్యం ఎమ్మెల్యే

**ఓర్వకల్ ప్రతినిధి, జనవరి 29, (రిపబ్లిక్ న్యూస్)** గురువారం రోజు,ఓర్వకల్లు:కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గ శ్రీ బుగ్గ రామేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా అన్ని శాఖల అధికారులతో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు.ముందుగా ఎమ్మెల్యే మరియు టిటిడి బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్ ఓర్వకల్ టిడిపి మండల కన్వీనర్ నాగిరెడ్డి,దేవాలయంలో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు.తర్వాత బ్రహ్మోత్సవాల సందర్భంగా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అధికారులు ఆలయ కమిటీ సభ్యులు మరియు కార్యకర్తలతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫిబ్రవరి 15న జరిగే రథోత్సవ కార్యక్రమం గతం కంటే ఈసారి చాలా చక్కగా శివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రతి అధికారి కృషి



చేయాలని అన్నారు, త్రాగునీరు,పారిశుధ్యం, విద్యుత్,స్త్రీ,పురుషులకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు ఉండే విధంగా చూడాలన్నారు.ఈ ప్రాంతంలో చెత్తా చెదారం లేకుండా చూడాలని కరెంటు సరఫరా కొరకు 15 లక్షల నిధులు మంజూరు చేయడం జరిగింది, అధిక సంఖ్యలో ప్రజలు వస్తున్నందున పోలీస్ సిబ్బంది అధికంగా ఉండేటట్లు చూడాలని ఓర్వకల్ ఎస్సై సునీల్ కుమార్ తో అన్నారు.అదేవిధంగా మహిళా పోలీస్ సిబ్బందిని నియమించాలని ఎమ్మెల్యే ఎస్పీతో ఫోన్ లో మాట్లాడారు.అందరి భాగస్వామ్యంతో



బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని పాణ్యం ఎమ్మెల్యేఅన్నారు.మల్లెల రాజశేఖర్ మాట్లాడుతూ కోనేరులో నీరు తగ్గకుండా నీరు పారుతూనే ఉండే విధంగా చూడాలని సౌండ్ సిస్టం ఈ ప్రాంతమంతా మైకులు ఉండాలని కమాండ్ కంట్రోల్ ఏర్పాటు చేయాలన్నారు.ఈ కార్యక్రమం లో పాల్గొన్నవారు టీటీడీ బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్ మరియు టిడిపి ఓర్వకల్లు మండలం కన్వీనర్ నాగిరెడ్డి ఎమ్మార్వో ఎంపీడీవో మరియు సంబంధించిన అధికారులు పాల్గొనడం జరిగింది టిడిపి అభిమానులునాయకులు తదితరులు పాల్గొన్నారు

# రైల్వే కోడూరులో మౌలికవసతుల అభివృద్ధి కి కోటి 30 లక్షల నిధులు మంజూరు. ముక్కారూపానంద రెడ్డి.







**ఓబులవారిపల్లి జనవరి 29 రిపబ్లిక్ న్యూస్.** రైల్వే కోడూరు పట్టణంలో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కోటి 30 లక్షల రూపాయల నిధులను మంజూరు చేసినట్లు కూడా చైర్మన్ మరియు రైల్వే కోడూరు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి ముఖరూపానంద రెడ్డి తెలియజేశారు. కోడూరు పట్టణం నుండి తులసి స్కూల్ వరకు సిమెంటు రోడ్డు నిర్మాణంకు మరియు అండర్ డ్రైనేజీ కి గురువారం భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగినది, ఈ కార్యక్రమం రూపానంద రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది పట్టణములో మౌలిక వసతుల లేమి వలన స్థానిక ప్రజలు సమస్యలను ఎదుర్కొంటున్నారని ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి ఈ ప్రాంత అభివృద్ధికి తగిన నిధులను మంజూరు చేయించడం జరిగిందని అందులో భాగంగా కోటి 30 లక్షలతో పట్టణంలో రోడ్లు డ్రైనేజీ విద్యుత్తు రూరల్ వాటర్ సప్లై పథకం కింద త్రాగునీటిసమస్యలను పరిష్కరించడం జరుగుతుందని తద్వారా ప్రజల రవాణా, త్రాగునీరు విద్యుత్తు స్థితిగతులు మెరుగవుతాయని ఆయన అన్నారు, సీసీ రోడ్డు నిర్మాణంతో రాకపోకలు మరింత సులభమవుతాయని, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థతో వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు తొలగిపోతాయని తెలిపారు. అలాగే ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్ పైప్‌లైన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రానుంది. కరెంట్ కనెక్షన్ల పనులతో విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడతొందన్నారు, రైల్వే కోడూరు పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేలా మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వం ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని అన్నారు. భవిష్యత్తులో కూడా పట్టణంతో పాటు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు కొనసాగిస్తామని ఈ సందర్భంగా ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. అలాగే కోడూరు మండలం వెంకట్ రెడ్డి పల్లె గ్రామంలో 10 లక్షల రూపాయల ఏమిటో సిసి రోడ్డు నిర్మాణం కొరకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మల్లికార్జున్ రెడ్డి, బొమ్మల రాజు సుబ్బరాజు, డి ఈ బాల నరసింహులు పాల్గొన్నారుస్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, పట్టణానికి అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నందుకు ముక్కా రూపానంద రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి, ఆర్డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ మండల అభివృద్ధి, మండల రెవెన్యూ, పంచాయతీరాజ్, సచివాలయ అధికారులు, ఎన్డీఏ కూటమి నేతలు కార్యకర్తలు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# బీటింగ్ రీట్రీట్ వేడుకలకు హాజరైన కర్నూల్ఎంపీ నాగరాజు



**కర్నూల్ ప్రతినిధి, జనవరి 29, (రిపబ్లిక్ న్యూస్)** గురువారం రోజున,దేశ రాజధాని ఢిల్లీలోని విజయ్ చౌక్ లో నిర్వహించిన బీటింగ్ రీట్రీట్ వేడుకలకు కర్నూల్ ఎంపీ బస్తిపాటి నాగరాజు హాజరయ్యారు.పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలలో పాల్గొంటున్న ఆయన, గణతంత్ర దినోత్సవ వేడుకల ముగింపులో భాగంగా నిర్వహించే బీటింగ్ రిట్రీట్ వేడుకల్లో పాల్గొన్నారు... ఈ సందర్భంగా అర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ బ్యాండ్ల ప్రదర్శనలు, దేశ భక్తి గీతాలు, శాస్త్రీయ సంగీత బాణీలను మేళమిస్తూ సైనిక దళాలు చేసిన కావతులను ఎంపీ వీక్షించారు

# వర్షధార పంటల అభివృద్ధి శిక్షణ




**గుత్తి జనవరి 29 (రిపబ్లిక్ న్యూస్ )** అనంతపురం జిల్లా గుత్తి మండలం లో గుత్తి ఏ డి ఏ వెంకటరాముడు అధ్యక్షత న ఆర్ ఏ డి రైన్ఫడ్ ఏరియా డెవలప్మెంట్ స్కీమ్ పై గుత్తి డివిజన్ లోని ఐదు మండలాల రైతులకు మండలం లోని సి ఎల్ అర్ సి బిల్డింగ్ నందు శిక్షణ ఇవ్వడం జరిగినది. ప్రతి మండలం నుంచి రైతులకు సమీక్రుత వ్యవసాయ సాగు పై ఉద్యాన, పశు సంవర్ధక శాఖల అధికారులు సూచనలు ఇవ్వడం జరిగింది..అదేవిదంగా కేవీక్ రెడ్డిపల్లి నుంచి వచ్చిన శాస్త్రవేత్త శ్రీమతి శశికల వానపాముల ఎరువు తయారీ, తేనెటీగల పెంపకం., పశువుల మేత మగ్గపెట్టే పద్ధతుల గురించి శిక్షణ ఇవ్వడం జరిగినది ఈ కార్యక్రమానికి పామిడి యాడికి పెద్దవాడుగురు సింగనమల వ్యవసాయ ఏవో ముస్తఫ్ మొహమ్మద్ ఖాన్ అధికారులు మరియు హార్టికల్చర్ ఆఫీసర్ వెటరినారి డాక్టరు ఏ ఈ ఓ లు మరియు రైతులు పాల్గొన్నారు

# శ్రీ మఠంలో టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు





**మంత్రాలయం, జనవరి, 29,(రిపబ్లిక్ న్యూస్):** ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన దేశంలో రెండో తిరుపతిగా పేరుగాంచిన మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామిని దర్శించుకునేందుకు వైసీపీ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు సీతారామిరెడ్డి వచ్చారు. ఆయనకు శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం పీఆర్ ఐపీ నరసింహమూర్తి సంప్రదాయంగా స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మ దేవిని,శ్రీ రాఘవేంద్ర స్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్ర తీర్థుల తో పలు ఆధ్యాత్మిక విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# వైసిపీ కార్యకర్త మృతి

## ప్రగాఢ సానుభూతి తెలిపిన జిల్లా ఉపాధ్యక్షులు ప్రదీప్ రెడ్డి





**మంత్రాలయం, జనవరి, 29,(రిపబ్లిక్ న్యూస్):** మంత్రాలయ మండల పరిధిలోని సుంకేశ్వరి గ్రామంలో గడ్డ చిన్నారెడ్డి మరణించిన విషయాన్ని తెలుసుకున్న కర్నూలు జిల్లా ఉపాధ్యక్షుల వారు శ్రీ వై.ప్రదీప్ రెడ్డి చిన్నారెడ్డి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఖర్చుల నిమిత్తం 10వేల రూపాయలు కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రదీప్ రెడ్డి వెంట విశ్వనాథ్ రెడ్డి మరియు మాజీ ఎంపీటీసీ రఘునాథ్ రెడ్డి , వైసిపి నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు..

# శ్రీ బోలికొండి రంగనాథ స్వామి బ్రహ్మోత్సవలకు ఆహ్వానం



**గుత్తి జనవరి 29( రిపబ్లిక్ న్యూస్)** అనంతపురం జిల్లా గుత్తి మండలంలోని తొండపాడు శ్రీ బోలికొండి రంగనాథ స్వామి ఆలయం కమిటీ వారుఆలూరు పట్టణం నందు గుంతకల్లు నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం ని వారి స్వగృహం నందు మర్యాదపూర్వకంగా కలిసి ఫిబ్రవరి 02 తారీఖున జరగబోయే శ్రీ బొలికొండ రంగనాథ స్వామి వారి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం జరిగినది అలాగే తొండపాడు గ్రామంలో జరగబోయే రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి రాతి దూలం పోటీలు నిర్వహిస్తున్నాము చెప్పడంతో స్పందించిన ఎమ్మెల్యే జయరాం సొంత నిధులు అక్షరాల 1,01,016 రూపాయలు అందించడం జరిగినది ఈ కార్యక్రమంలో తొండపాడు బి చిన్న రెడ్డి రెడ్డి యాదవ్, బి రంగస్వామి రెడ్డి యాదవ్, డీలర్ దేగ మద్దిలేటి మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# లడ్డూ కల్తీ పాపం జగన్ అండ్ కో..దే

## కల్తీ నెయ్యి వాడారని సిట్ తేల్చింది -వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



ఒంగోలు ,**జనవరి 29 రిపబ్లిక్ న్యూస్.**
జగన్ హయాంలో తిరుపతి లడ్డూను కల్తీ చేశారని.. ఆ పాపం జగన్ అండ్‌కో దేనని ఏపీ వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ధ్వజమెత్తారు. కోట్లాదిమంది భక్తులు ఆరాధించే తిరుమల లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి వాడారని సిట్ నివేదిక ఇచ్చిందని ప్రస్తావించారు. కెమికల్స్ ఉపయోగించి లడ్డూ తయారు చేశారని ఆగ్రహించారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై సత్యకుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.250 కోట్ల అవినీతి చేసిన వాళ్లని జైలుకు పంపితే దాన్ని రెడ్‌బుక్ రాజ్యాంగం అని ఎలా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. ప్రకాశం జిల్లాలో మంత్రి సత్యకుమార్ గురువారం పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తప్పు చేసిన వాళ్లని వదిలేయండి, రప్పా రప్పా అన్న వాళ్లని వదిలేయండి, తలలు ఎగరేసి నరుకుతామనే వాళ్లని ఉపేక్షించాలనేలా జగన్ మాట్లాడుతున్నారన్ని÷ర్ అయ్యారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రధాని నరేంద్ర మోదీల వల్ల.. ప్రజలకు అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని స్పష్టం చేశారు. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఓ వ్యక్తిగత విషయాన్ని వైసీపీ బూతద్దంలో చూపిస్తోందని మంత్రి సత్యకుమార్ దుయ్యబట్టారు. 'వ్యక్తిగత విషయాలను కూటమి ప్రభుత్వానికి రుద్దే ప్రయత్నం వైసీపీ చేస్తోంది. జగన్ మాటలు చూసి ఆయన అవగాహన రాహిత్యంపై నవ్వొస్తోంది. సొంత బాబాయ్‌కు గొడ్డలి పోటు వేసి గుండెపోటుగా నమ్మించాలని జగన్ చూశారు. సొంత చె÷–లలెలి మీదే తండ్రిని చంపిన కేసు మోపేందుకు కుట్రపన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకువచ్చి భూములు కొట్టేయాలని ప్రయత్నించారు. సొంత ఖజానా నింపుకోవడం కోసం నాణ్యత లేని మద్యం అమ్మి ప్రజల ప్రాణాలు తీయడం జగన్‌కు పాపంగా అనిపించడం లేదు. ప్రజా సమస్యలు ప్రస్తావించకుండా బాధ్యతలు విస్మరించి అసత్య ప్రచారాలు చేసుకుంటున్నారు' అని మంత్రి ధ్వజమెత్తారు. కదిరిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో గర్భిణి మరణిస్తే.. ఆస్పత్రి మూసివేశామని మంత్రి సత్యకుమార్ స్పష్టం చేశారు. 'ప్రభుత్వ ఆస్పత్రిలో మరణించినట్లుగా వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రజాస్వామ్యంపై గౌరవముంటే జగన్ అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి. వారానికి ఒకరోజు విజిటర్ పొలిటీషియన్‌లా జగన్ ఏపీకి వచ్చి పోతున్నారు. జగన్‌కు ఇప్పటికే ప్రజలు గుణపాఠం చెప్పారు. ఆత్మ విమర్శ చేసుకుని సరైన మార్గంలోకి రాకపోతే.. మీ రాజకీయ సమాధి మీరే కట్టుకున్నట్లే. ఏపీలో అమాయకులను మా ప్రభుత్వం అరెస్ట్ చేయలేదు. మద్యం కేసులో ఉన్నవాళ్లు, ప్రజల ప్రాణాలు తీసినవాళ్లు, పోలింగ్ బూతుల్లోకి వెళ్లి గొడ్డలితో దాడులు చేసిన వాళ్లే అరెస్టయ్యారు' అని మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

------

# పర్యాటకంగా రాష్ట్రం అభివృద్ధి

## అనకాపల్లి ఉత్సవ్ ఏర్పాట్లు పరిశీలించిన అనిత

అనకాపల్లి,**జనవరి 29 రిపబ్లిక్ న్యూస్.**




రాష్ట్ర పర్యాటక రంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. గురువారం అనకాపల్లి జిల్లాలో అనిత పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనకాపల్లి ఉత్సవ్ నేపథ్యంలో ముత్యాలమ్మపాలెం తీరంలో.. విద్యుత్ దీపాలు, బీచ్ స్పోర్ట్స్, వాటర్ స్పోర్ట్స్, లైవ్ బ్యాండ్, ఫుడ్ స్టాల్స్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా ఉన్నారు. అనకాపల్లి ఉత్సవ్‌ను ఈనెల 30, 31 తేదీల్లో అత్యంత వైభవంగా నిర్వహిం చేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయని హోం మంత్రి తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల ఆధ్వర్యంలో ఏపీలో పర్యాటక శాఖ అభివృద్ధి చెందుతోందని చెప్పుకొచ్చారు. గతంలోనూ విశాఖపట్నం ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించామని ఆమె గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక కళాకారులకు ఈ ఉత్సవాల్లో అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని హోం మంత్రి తెలిపారు. ఈ మేరకు ముత్యాలమ్మపాలెం తీరంలో అనేక కార్యక్రమాలు జరగనున్నాయని తెలిపారు. కొండకర్లలోనూ వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేశామని వివరించారు. అనకాపల్లిలో ఫ్లవర్ షో, క్రాకర్స్ షో, సంగీత విభావరి సహా కార్నివాల్‌నూ ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. గజ ఈతగాళ్లను కూడా తీరంలో సిద్ధంగా ఉంచుతున్నామన్నారు.

# గీతం ఆధీనంలో 54.79 ఎకరాల భూమి

## క్రమబద్ధీకరణను వ్యతిరేకిస్తూ వైకాపా ఆందోళన

## అడ్డుకున్న గీతం భద్రతా సిబ్బంది

విశాఖపట్నం**జనవరి 29 రిపబ్లిక్ న్యూస్.**



గీతం యూనివర్సిటీ ఆధీనంలో ఉన్న 54.79 ఎకరాల భూమి క్రమబద్ధీకరణను వైసీపీ వ్యతిరేకిస్తోంది. గురువారం ఆ భూములను పరిశీలించేందుకు విశాఖపట్నంలోని వైసీపీ నేతల బృందం వెళ్లింది. ఈ బృందాన్ని మెయిన్ గేట్ వద్ద గీతం యూనివర్సిటీ భద్రతా సిబ్బంది అడ్డుకుంది. దీంతో ఆ బృందంలోని సభ్యులు యూనివర్సిటీ మెయిన్ గేట్ వద్ద నిరసన చేపట్టారు. దాంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్థానిక పోలీసులు రంగంలోకి దిగి.. ఆ బృందాన్ని అక్కడ నుంచి తరలించేందుకు చర్యలు చేపట్టారు. గీతం యూనివర్సిటీ ఆధీనంలో ఉన్న 54.79 ఎకరాల భూమిని క్రమబద్ధీకరించేందుకు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) కౌన్సిల్ తీర్మానాన్ని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను విశాఖపట్నంలోని వైసీపీ కార్పొరేటర్లతోపాటు స్థానికంగా ఆ పార్టీ నేతలు సైతం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. అందుకోసం ఈ భూములు పరిశీలించేందుకు సదరు బృందం గురువారం గీతం యూనివర్సిటీ వద్దకు చేరుకుంది. ఆ బృందం యూనివర్సిటీలోకి వెళ్లేందుకు ప్రయత్నించింది. వారి ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని.. ఆందోళనకు దిగిన వైసీపీ నేతలను అరెస్ట్ చేసేందుకు సిద్ధమయ్యారు.

------------

# రెండు లారీలు ఢీకొన్న ఘటనలో డ్రైవర్ సజీవ దహనం

కాకినాడ,**జనవరి 29 రిపబ్లిక్ న్యూస్.** కత్తిపూడి వద్ద జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున ఓ లారీని మరో లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ సజీవ దహనమయ్యాడు. 16వ నంబర్ జాతీయ రహదారిపై లారీ యూటర్న్ తీసుకుంటుండగా.. అదే సమయంలో వేగంగా వస్తున్న మరో లారీ ఢీకొట్టింది. దీంతో ఓ లారీలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దాంతో డ్రైవర్ సజీవ దహనమయ్యాడు. ఆ రహదారిపై వెళ్తున్న వాహనదారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని.. అగ్నిమాపక సిబ్బంది సహాయంతో మంటలార్పేశారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి బాధ్యుడైన లారీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ప్రమాదం కారణంగా.. జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఇక సజీవ దహనమైన డ్రైవర్ స్వస్థలం కోల్‌కతా అని పోలీసులు వెల్లడించారు.

# కీచక ఎమ్మెల్యేని వెంటనే అరెస్ట్ చేసి

# బాధితురాలుకి న్యాయం చేయాలి

## -కొరముట్ల శ్రీనివాసులు

**ఓబులవారిపల్లి జనవరి 29 రిపబ్లిక్ న్యూస్.**
దళిత మహిళా ఉద్యోగిని పై అధికార దుర్వినియోగా నికి పాల్పడి లైంగికంగా వేధించిన రాష్ట్ర ప్రభుత్వ విప్పు రైల్వేకోడూరు జనసేన పార్టీ శాసనసభ్యులు ఆరవ శ్రీధర్ ని వెంటనే అరెస్టు చేయాలని, రైల్వే కోడూరు మాజీ శాసనసభ్యులు వైఎస్ఆర్సిపి అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు

గురువారం ఉదయం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి టోల్గేట్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం వరకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు మహిళలతో కలిసి భారీగా,నల్ల బ్యాడ్జీలు ధరించి శాంతియుతంగా నిరసన తెలియజేశారు, అనంతరం పత్రిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో మహిళలకు ఏమాత్రం గౌరవం లేకుండా పోతుందని స్వయాన ప్రజా ప్రతినిధులే మహిళలపై అఘాయిత్యాలకు, దాడులకు పాల్పడుతుంటే ఎటువంటి చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం ఎనుమీద వాన కురిసినట్లు చోద్యం చూస్తున్నదని ఆయన ఎద్దేవ చేశారు, తాజాగా రైల్వే కోడూరు ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్ తనపై అఘాయిత్యానికి పాల్పడుతూ ఒకటిన్నర సంవత్సరం నుండి వేధిస్తున్నాడని ఒక ప్రభుత్వ మహిళా ఉద్యోగి అయిన బాధితురాలు మీడియా ముందుకు వచ్చి సాక్షాదారాలతో సహా చూపిస్తూ ఉంటే ఆ ఎమ్మెల్యే పైన ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం శోచనీయం అన్నారు,వీరి నిరంకుసపాలనకు నిదర్శనమని, డిప్యూటీ



సీఎం పవన్ కళ్యాణ్ గత ఎన్నికల ప్రచారంలో సామాన్యుడు తప్పు చేసిన పవన్ కళ్యాణ్ తప్పు చేసిన ఒకే విధంగా శిక్ష పడేలా చట్టాలు తీసుకువస్తామని మైకుల ముందు ఊగుతూ చెప్పాడని కానీ నేడు మీడియా వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ముఖంచాటేయడం ఆయన చౌకబారు రాజకీయానికి నిదర్శనం అన్నారు,అసలు రాష్ట్ర హోం మంత్రి ఉన్నారా, లేక కళ్ళకు గంతలు కట్టుకొని ఉన్నార అంటూ ఆమెపై ఆరోపణలు చేశారు,గత పది రోజులు క్రిందట సంక్రాంతి పండుగకు నారావారిపల్లిలో బాధితురాలు వెళ్లి సీఎం చంద్రబాబు నాయడు ని కలిసి తనకు జరిగిన అన్యాయాన్ని వినతి పత్రం రూపంలో వివరించినప్పటికీ ఎటువంటి స్పందన లేకపోవడం బాధాకర విషయమని తక్షణమే ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్ని అరెస్టు చేసి బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు,లేనియెడలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని మహిళలకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని కొరముట్ల శ్రీనివాసులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో

వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి, రైల్వే కోడూరు వైస్ ఎంపీపీ రామిరెడ్డి






ద్వజా రెడ్డి, ఓబులవారిపల్లి మండల కన్వీనర్ సాయి కిషోర్ రెడ్డి, చిట్వేల్ మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులురెడ్డి, ,మాదినేని వెంకట్ రెడ్డి,పుల్లంపేట మండల కన్వీనర్ ముస్తాక్,జడ్పిటిసి రత్నమ్మ, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మేంబర్ నంద బాల, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు శివారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ సుబ్బరామరాజు,పట్టణ అధ్యక్షుడు సిహెచ్ రమేష్, సర్పంచులు శైలజ, ఎంపీటీసీలు పుష్పలత,నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు నారాయణమ్మ, గౌసియా, మరియు వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు తదితరులు భారీగా పాల్గొన్నారు

# తెలంగాణలో పట్టణ పోరుకు రంగం సిద్ధం !

**జనవరి 29 రిపబ్లిక్ న్యూస్.**
ఎన్నికలంటే రాజకీయ పార్టీలకు పండగ. సవాళ్లు, ప్రతి సవాళ్లతో కాలం గడిపేయవచ్చు. అనుయాయులను గెలిపించుకునేందుకు ఆరాటపడం తప్ప మరోటి ఉండదు. మొన్నటికి మొన్న తెలంగాణలో గ్రామాల్లో పంచాయితీ ఎన్నికల సందడి ముగిసింది. ఇప్పుడు మున్సిపల ఎన్నికలకు నగారా మోగడంతో రాజకీయ పార్టీల్లో హడావిడి జోరందుకుంది. పార్టీ పరంగానే ఎన్నికలు జరగనున్న కారణంగా అధికార, విపక్ష పార్టీలు రాజకీయంగా పట్టు సాధించాలంటే మున్సిపాలిటీల్లో పదవులను గెల్చుకోవాల్సి ఉంటుంది. తమ పార్టీ అభ్యర్థులను నిలబెట్టడం, గెలిపించుకోవడం కోసం గట్టి ప్రయత్నాలు చేయనున్నారు. దీంతో పట్టణాలు, గ్రేటర్ హైదరాబాద్ ఇప్పుడు రాజకీయ రణక్షేత్రాలు కానున్నాయి. మొత్తంగా మున్సిపల్ పోరు మొదలైంది. తాజాగా ఎన్నికల కమిషన్ మంగళవారం షెడ్యూల్ విడుదల చేసింది. మంగళవారం సాయంత్రం నుంచే కోడ్ అమల్లోకి వచ్చింది. బుధవారం నుంచి నామినేషన్ల ఘట్టం మొదలయ్యింది. పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయడంతోపాటు ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నద్ధమైంది. మొత్తంగా పంచాయితీ తరవాత ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది. 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించి ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారికంగా విడుదల చేశారు. ఫిబ్రవరి 11న పోలింగం నిర్వహిస్తారు. రీ పోలింగ్ అవసరమైన చోట్ల 12న జరుపుతారు. వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి రాగా, నేటినుంచే నామినేషన్ల స్వీకరణ మొదలు కానుంది. ఈ ఎన్నికల పక్రియ ద్వారా మొత్తం 52 లక్షల 43 వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రజాస్వామ్య పండుగలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కమిషనర్ ఈ సందర్భంగా కోరారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈనెల 28వ తేదీ బుధవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం అయ్యింది. అభ్యర్థులు తమ నామినేషన్లను జనవరి 30వ తేదీ సాయంత్రం 5:00 గంటల వరకు దాఖలు చేయవచ్చు. జనవరి 31న నామినేషన్ల పరిశీలన చేపట్టి, అదే రోజు సాయంత్రం అర్హత పొందిన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. ఫిబ్రవరి 3వ తేదీ మధ్యాహ్నం 3:00 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. అనంతరం తుది బరిలో నిలిచే అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తారు. అన్ని జిల్లాల కలెక్టర్లు,ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని సమావేశం నిర్వహించారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. 31న అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన అనంతరం అర్హత పొందిన వారి జాబితా ప్రకటిస్తారు. ఫిబ్రవరి




3.. నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు కాగా ఫిబ్రవరి 11న పోలింగ్ నిర్వహిస్తారు. రీపోలింగ్ ఎక్కడైనా ఉంటే ఫిబ్రవరి 12న నిర్వహిస్తారు. ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితం ప్రకటిస్తారు. ఫిబ్రవరి 16న మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక జరుగుతుంది. ఫిబ్రవరి 16న కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక చేపడతారు. మున్సిపల్ ఎన్నికల్లో 53 లక్షల మందికి పైగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు కమిషనర్ తెలిపారు. షెడ్యూల్ విడుదలతో పార్టీలు తమ అభ్యర్థులను గెలిపించుకొని పట్టణాలపై పట్టు సాధించేందుకు ఆయా పార్టీలు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. షెడ్యూల్ రావడంతో తమ ప్రయత్నాల్లో అభ్యర్థులు తలమునకల య్యారు. సాధారణంగా ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత మాత్రమే అభ్యర్థులు ఖర్చుకు మొగ్గు చూపుతారు. పురపోరులో పాల్గొనదల్చిన అభ్యర్థులు ఇప్పటికే భారీగా ఖర్చు పెట్టారు. ఇప్పుడు నోటిఫికేషన్ రావడంతో మళ్లీ ఖర్చులకు తెరలేవనున్నది. ఇదిలా ఉంటే పట్టు నిరూపించుకోవాలని ప్రధాన పార్టీలు తహతహ లాడుతున్నాయి. పార్టీ గుర్తింపు ఎన్నికలే అయినా తమ అభ్యర్థులను గెలిపించు కునేందుకు ప్రయత్నాలు అప్పుడే మొదలు పెట్టాయి. ఇకపోతే రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించడంతో నామినేషన్ల పర్వం కూడా మొదలయ్యింది. ఒకే రోజు పోలింగ్, ఓట్ల లెక్కింపు, అదే రోజు ఫలితాల వెల్లడి చేపట్టబోతున్నారు. పట్టణాలు, వార్డుల్లో మళ్లీ దావత్‌ల జోరు అందుకోనుంది. ఎన్నికల్లో మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ తన చేతులో ఉన్న అధికారాన్ని అడ్డంగా వాడుకుంటుం డటంపై బిఆర్ఎస్, బిజెపిల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో పోటీ చేయాలనుకొనే ఆశావహులు మద్దతు కూడగట్టు కునేందుకు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు. తమ వర్గాలు, గ్రూపులను పోగేసుకోవడంతో పాటు తమ ప్రాతినిధ్యాన్ని బలపర్చాలని ముఖ్య కార్యకర్తలు, అనుచరులను కోరుతున్నారు. రిజర్వేషన్లు ఖరారు కావడంతో కొందరు అభ్యర్థులు తమ భార్యలను రంగంలోకి దింపే ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయా పార్టీల పెద్దలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులను ప్రసన్నం చేసుకొని ఎలాగైనా పోటీలో నిలిచేందుకు యత్నిస్తున్నారు. ఓటర్లను కూడా ప్రసన్నం చేసుకొనే పనిలో పడ్డారు. అభ్యర్థులకు కేవలం రెండు వారాలు మాత్రమే ప్రచారానికి సమయం దొరుకుతోంది. ఒకింత మంచిదే అయినప్పటికీ ఎన్నికల ఖర్చు తడిసి మోపెడు అవుతుందనే బాధ కూడా అభ్యర్థుల్లో ఉంది. మొత్తంగా పట్టణాల్లో హడావిడి కొనసాగుతోంది. ఓటర్లకు మాత్రం ఇది ముమ్మాటికీ పండగే.



# ఒప్పుకోకుంటే లేచి పోదామనుకున్నం

'మహానటి' కీర్తి సురేష్ తన చిన్ననాటి స్నేహితుడు, లాంగ్ టైమ్ బాయ్‌ఫ్రెండ్ ఆంటోనీ తట్టిల్‌ను ప్రేమ వివాహం చేసుకుని అభిమానులను సర్ప్రైజ్ చేసిన విషయం తెలిసిందే. అయితే తాజాగా తన ప్రేమ, పెళ్లికి సంబంధించిన కొన్ని షాకింగ్ విషయాలను కీర్తి సురేష్ తాజాగా పంచుకుంది. తాము 15 ఏళ్లుగా ప్రేమలో ఉన్నామని, ఒకానొక దశలో తమ పెళ్లికి పెద్దలు అంగీకరించకపోతే 'లేచిపోయి' పెళ్లి చేసుకోవాలని కూడా నిర్ణయించుకున్నట్లు ఆమె వెల్లడించి అందరినీ ఆశ్చర్యపరిచింది. తమ పెళ్లి ఇంత వైభవంగా, అందరి సమక్షంలో జరుగుతుందని తాము అస్సలు ఊహించలేదని, కానీ చివరికి పెద్దల అంగీకారంతో గోవాలో కుటుంబ సభ్యుల మధ్య తమ వివాహం వేడుకగా జరిగిందని కీర్తి పేర్కొంది.

పెళ్లి సమయంలో జరిగిన భావోద్వేగ క్షణాలను గుర్తు చేసుకుంటూ, ఎప్పుడూ చాలా ధైర్యంగా, దృఢంగా ఉండే ఆంటోనీ తాళి కట్టే సమయంలో తొలిసారి ఎమోషనల్ అయ్యాడని ఆమె తెలిపింది. ఆయన కళ్లలో నీళ్లు చూడటంతో తాను కూడా భావోద్వేగానికి లోనయ్యానని, 15 ఏళ్ల నిరీక్షణ కేవలం 30 సెకన్ల మంగళసూత్ర ధారణతో ఒక అందమైన బంధంగా మారిందని కీర్తి ఆనందం వ్యక్తం చేసింది. ఆ క్షణం ఒక కల నిజమైనట్లు అనిపించిందని, ఆ ఆనందంలో కన్నీళ్లు ఆగలేదని ఆమె చెప్పుకొచ్చింది. ప్రస్తుతం కీర్తి సురేష్ తన వైవాహిక జీవితాన్ని ఎంజాయ్ చేస్తూనే, వరుస సినిమాలతో కెరీర్ పరంగా కూడా దూసుకుపోతోంది.



# వరుసగా సినిమాలతో ప్రభాస్ బిజీ

వరుసగా సినిమాలు పూర్తి చేయడంలో ప్రభాస్ బిజీగా ఉన్నారు. ప్రస్తుతం 'ఫౌజీ', 'స్పిరిట్' సినిమాల చిత్రీకరణ సాగుతుండగా, 'కల్కి2' సినిమానీ పట్టాలెక్కించాలని నిర్ణయించారు. విజయవంతమైన 'కల్కి 2898 ఏడీ'కి కొనసాగింపుగా రూపొందుతున్న చిత్రమే 'కల్కి 2'. నాగ్ అశ్విన్ కొంతకాలంగా ఈ సినిమా పూర్వ నిర్మాణ పనుల్ని చేస్తూ వస్తున్నారు. వచ్చే నెలలోనే ప్రారంభం కానున్న ఈ సినిమాకీ ప్రభాస్ కొన్ని రోజులు డేట్స్ కేటాయించినట్టు తెలుస్తోంది. అంటే... మళ్లీ మూడు సినిమాల్ని ఒకేసారి ముందుకు నడిపిస్తారన్నమాట. 'ది రాజాసాబ్' ఫలితాన్ని దృష్టిలో పెట్టుకుని వీలైనంత త్వరగా ఆయన కొత్త సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలనే ఉద్దేశంలో ఉన్నట్టు తెలుస్తోంది. నిజానికి ఒక సినిమా పూర్తయ్యాక మరొక సినిమా అనే పద్ధతికి ఎప్పుడో ఫుల్‌స్టాప్ పెట్టేశారు ప్రభాస్. ఆయన కొంతకాలంగా ఒకేసారి రెండు, మూడు చొప్పున సినిమాల్ని ముందుకు నడిపిస్తున్నారు. 'ది రాజాసాబ్' సినిమాతో బిజీగా ఉన్న సమయంలోనే, 'కల్కి 2898 ఎ.డి', 'ఫౌజీ' సినిమాల్నీ చేశారు. దేశవ్యాప్తంగా బలమైన మార్కెట్ ఉన్న ఆయన కోసం పలు కథలు సిద్ధం అవుతున్నాయి. అన్నీ కూడా పాన్ ఇండియా స్థాయిలో, భారీ హంగులతో రూపొందుతున్న కథలే. ఏడాదికి రెండు సినిమాల్నైనా ప్రేక్షకుల ముందుకు తీసుకు రావాలనే లక్ష్యంతో ఆయన ఆయా ప్రాజెక్టుల్ని వెంట వెంటనే పట్టాలెక్కిస్తూ వాటి కోసం డేట్లు కేటాయిస్తున్నారు.

# హైప్ క్రియేట్ చేసినా.. ప్రేక్షకులు ఆదరిస్తారా అన్నదే ముఖ్యం

## సినిమాల తీరుపై నటుడు విజయ్ సేతుపతి కామెంట్స్



తెలుగు, తమిళంతోపాటు పాన్ ఇండియా ఇమేజ్ ఉన్న యాక్టర్లలో టాప్‌లో ఉంటాడు కోలీవుడ్ యాక్టర్ విజయ్ సేతుపతి. ప్రస్తుతం అరవింద్ స్వామితో కలిసి గాంధీ టాక్స్ సినిమాలో నటిస్తున్నాడు. సాదాసీదా నటనతో ప్రేక్షకులను కట్టిపడేయడం ఈ టాలెంటెడ్ నటుడి స్పెషాలిటీ అని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు షేర్ చేసుకున్నాడు మక్కళ్ సెల్వన్. ఈ రోజుల్లో చాలా మంది యాక్టర్లు, డైరెక్టర్లు తమ సినిమాలు ప్రేక్షకులను ఆకర్షించేందుకు హైప్ క్రియేట్ చేసేందుకు ఏదో ఒక విషయాన్ని హైలెట్ చేయాలని ప్రయత్నిస్తుంటారని తెలిసిందే. విజయ్ సేతుపతి తన అప్‌కమింగ్ మూకీ సినిమా 'గాంధీ టాక్స్' గురించి మాట్లాడాడు.. డైలాగ్స్ లేకుండా ఎమోషన్స్‌తో ప్రేక్షకులతో దగ్గరయ్యేందుకు రెడీ అవుతున్నారు విజయ్ సేతుపతి, అరవింద్ స్వామి. ప్రేక్షకులకు వినోదం కోసం థియేటర్లకు వస్తారు కాబట్టి ఫిల్మ్‌మేకర్స్ ప్రేక్షకులు అర్థం చేసుకోలేని విధంగా సినిమా తీయొద్దని సూచించాడు విజయ్ సేతుపతి. ఓ వైపు ప్రయోగాలకు వెల్ కమ్ చెబుతూనే.. మరోవైపు ప్రేక్షకులు ప్రత్యేకించి డబ్బులు చెల్లించి సినిమా చూసేందుకు వస్తున్నప్పుడు వారికి ఖర్చు భారమనిపించేలా సినిమా ఉండకూడదని అన్నాడు విజయ్ సేతుపతి. గాంధీ టాక్స్ స్పెషల్ సినిమా ఏం కాదు.. కానీ సరికొత్త సినిమా చూసిన అనుభూతిని మాత్రం తప్పకుండా ఇస్తుందని ధీమా వ్యక్తం చేశాడు. సినిమా సంప్రదాయ ఫార్మాట్ ను ఫాలో అవకపోవడంతో గాంధీ టాక్స్ చిత్రాన్ని ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారో టీం మెంబర్స్ అంతా మొదట ఆందోళన చెందారని.. అయితే దగ్గరి స్నేహితులకు స్పెషల్ స్క్రీనింగ్ వేసిన తర్వాత పాజిటివ్ స్పందన వచ్చిందని.. దాంతో సినిమాపై నమ్మకం పెరిగిందన్నాడు విజయ్ సేతుపతి. అయితే వారిచ్చిన ఫీడ్ బ్యాక్ సినిమా మార్కెట్ కోసం ఉపయోగపడదని కూడా చెప్పాడు. టీం అంతా ముందుగా ఈ చిత్రాన్ని సూపర్ హిట్ అవుతుందని ఆశలు పెట్టుకున్నారు. కానీ వారిప్పుడు సినిమా హిట్టవ్వాలని కోరుకుంటున్నారని చెప్పుకొచ్చాడు.



# యుఫోరియాతో విజయం సాధిస్తా: గుణశేఖర్

కొన్ని సంవత్సరాలు సినిమాలకు దూరంగా విలువైన సమయాన్ని వృథా చేశానని దర్శకుడు గుణశేఖర్ చెప్పారు. కానీ, ఇప్పుడు పూర్తిగా దృష్టిసారించినట్లు తెలిపారు. ఇకపై ఎలాంటి విరామం లేకుండా నిరంతరం సినిమాలు చేస్తానని, బలమైన కంటెంట్‌తో ప్రేక్షకుల ముందుకురావడమే తన లక్ష్యమని వెల్లడించారు. ప్రస్తుతం ఆయన యుఫోరియా సినిమాతో ముందుకు వచ్చారు. ప్రేమ కథలనైనా, దేశభక్తి చిత్రాలైనా, చారిత్రక సినిమాలనైనా తనదైన శైలిలో తెరకెక్కించగల దర్శకుడు గుణశేఖర్. ఇప్పుడాయన 'యుఫోరియా'తో పలకరించేందుకు సిద్ధమయ్యారు. ఈ సినిమా ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన తన కెరీర్ గురించి మాట్లాడారు. కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేదని 'యుఫోరియా'తో హిట్‌ను సొంతం చేసుకుంటానన్న నమ్మకం ఉందన్నారు. గతంతో పోలిస్తే తన అనుభవం, ఆలోచనా విధానం ఇప్పుడు మరింత ఉన్నతస్థాయికి చేరాయన్నారు. రాబోయే ప్రాజెక్టులు మరింత ప్రత్యేకంగా ఉంటాయని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. 1992లో ఇండస్ట్రీకి వచ్చిన గుణశేఖర్ వరుస సినిమాలతో అలరించారు. 2015లో 'రుద్రమదేవి' తర్వాత 8 సంవత్సరాలు విరామం తీసుకున్నారు. తర్వాత 2023లో సమంతతో 'శాకుంతలం' తీశారు. అది కూడా అనుకున్నస్థాయిలో విజయం సాధించలేదు. ఇప్పుడు మూడేళ్ల తర్వాత 'యుఫోరియా' అనే కొత్త కాన్సెప్ట్‌తో ప్రేక్షకులను పలకరించనున్నారు. నేటి యువతకు, కుటుంబ ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యే వైవిధ్యమైన కథతో రూపొందిన చిత్రమిదని ఆయన తెలిపారు. భూమిక, సారా అర్జున్, నాజర్, రోహిత్, విఘ్నేశ్ గవిరెడ్డి ప్రధాన పాత్రలు పోషించారు.

# అమ్మా నీ ఆశీర్వాదమే నా బలం

## తల్లి అంజనాదేవి పుట్టినరోజు చిరు పోస్ట్




పదవులు, ఖ్యాతి, పేరు ఎంత ఉన్నా.. తల్లి ముందు మాత్రం ప్రతి కొడుకు చిన్నవాడే. అదే విషయాన్ని మరోసారి నిరూపించారు మెగాస్టార్ చిరంజీవి. కోట్లాది మంది అభిమానులకు ఆయన లెజెండ్ అయినా, తన తల్లి అంజనా దేవి ముందు మాత్రం ఒక సాధారణ కుమారుడిగా మారిపోతారు. ఆమె పుట్టినరోజు సందర్భంగా చిరంజీవి చేసిన భావోద్వేగ పోస్ట్ ఇప్పుడు అభిమానులను హత్తుకుంటోంది. జనవరి 29 అంజనా దేవి పుట్టినరోజు కావడంతో, చిరంజీవి సోషల్ మీడియా వేదికగా ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. 'అమ్మా.. నీ ఆశీర్వాదమే నా బలం. పుట్టినరోజు శుభాకాంక్షలు' అంటూ ఎక్స్ లో ఓ ఎమోషనల్ మెసేజ్‌ను పంచుకున్నారు. ఈ సందేశంతో పాటు ఒక ప్రత్యేక వీడియోను కూడా అభిమానులతో షేర్ చేశారు. ఆ వీడియోలో మెగా కుటుంబ సభ్యులందరితో కలిసి అంజనా దేవి గడిపిన అరుదైన క్షణాలు, కుటుంబ వేడుకల ఫోటోలు, మధురమైన జ్ఞాపకాలు కనిపిస్తున్నాయి. ఈ విజువల్స్ అభిమానులను మాత్రమే కాదు, సామాన్య ప్రేక్షకులను కూడా భావోద్వేగానికి గురిచేస్తున్నాయి. వీడియో విడుదలైన కొద్దిసేపటికే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మెగా అభిమానులు పెద్ద ఎత్తున స్పందిస్తూ అంజనమ్మకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. చిరంజీవి తన తల్లిపై ఉన్న ప్రేమను ఎప్పుడూ దాచుకోరు. ప్రతి ఏడాది ఆమె పుట్టినరోజు, మదర్స్ డే వంటి సందర్భాల్లో తప్పకుండా ఆమెను గుర్తు చేసుకుంటారు. షూటింగ్‌లు, రాజకీయ కార్యక్రమాలు, ఇతర బాధ్యతలతో ఎంత బిజీగా ఉన్నా.. తల్లితో సమయం గడపడానికి చిరు ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తారని సన్నిహితులు చెబుతుంటారు. కుటుంబ విలువలు, క్రమశిక్షణ, ఓర్పు, సహనం వంటి గుణాలు తన తల్లి నుంచే నేర్చుకున్నానని చిరంజీవి పలు సందర్భాల్లో వెల్లడించారు. మెగా కుటుంబానికి అంజనా దేవి ఒక అండగా, ధైర్యంగా ఉంటారని చిరు ఎప్పుడూ చెబుతుంటారు. గత ఏడాది కూడా ఆమె పుట్టినరోజును కుటుంబ సభ్యుల మధ్య ఘనంగా నిర్వహించారు.

# జోర్డాన్ వెళుతున్న జూనియర్ ఎన్టీఆర్..



యంగ్ టైగర్ ఎన్టీఆర్, సంచలన డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్లో భారీ బడ్జెట్ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకు సంబంధించిన తాజా అప్డేట్ బయటకు వచ్చింది. సినిమా నెక్స్ట్ షెడ్యూల్ ఫిబ్రవరి 5 నుంచి జోర్డాన్ జరగబోతోందని తెలుస్తోంది. హైవోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలను ఈ షెడ్యూల్ లో చిత్రీకరించబోతున్నారు. ఈ కీలక షెడ్యూల్ షూటింగ్ కు సంబంధించి అన్ని ఏర్పాట్లను చిత్ర యూనిట్ పూర్తి చేసింది. అయితే, షూటింగ్ ప్రారంభానికి రెండు, మూడు రోజుల ముందే జూనియర్ ఎన్టీఆర్ జోర్డాన్ కు వెళుతున్నట్టు సమాచారం. ముందే వెళితే అక్కడి వాతావరణానికి అలవాటు పడవచ్చనేది తారక్ ఆలోచనగా తెలుస్తోంది. మరోవైపు ఈ సినిమాపై ఇప్పటికే పాన్ ఇండియా లెవెల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తుందని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.



# మైనారిటీల సంక్షేమమే కూటమి ధ్యేయం

## బడ్జెట్ ప్రతిపాదనలపై మంత్రి ఎన్ఎండి ఫరూక్ సమీక్ష

**అమరావతి జనవరి 29( రిపబ్లిక్ న్యూస్) :**
రాష్ట్రంలోని మైనారిటీ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. మైనారిటీ శాఖ కార్యదర్శి సిహెచ్ శ్రీధర్, మైనారిటీ సంక్షేమ శాఖ వివిధ విభాగాల ఉన్నతాధికారులతో ప్రస్తుత బడ్జెట్ వినియోగం, వచ్చే ఆర్థిక సంవత్సరంకు సంబంధించి బడ్జెట్ రూపకల్పన, పీఎంజేవికే,పియం వికాస్ తదితర విషయాలపై మంత్రి సమీక్ష చేశారు. గురువారం తాడేపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో సమీక్ష జరిగింది. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో మైనారిటీల సంక్షేమానికి కేటాయించిన బడ్జెట్, వినియోగంలో చేపట్టిన వివిధ అంశాలకు సంబంధించిన ప్రస్తుత పరిస్థితిపై మంత్రి ఆరా తీశారు. కేటాయించిన బడ్జెట్ను సంబంధిత ప్రయోజనాలకు పూర్తిగా వినియోగించాలని ఆదేశించారు. వచ్చే నెలలో జరిగే అసెంబ్లీ సమావేశాలలో ప్రభుత్వం బడ్జెట్ ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో మైనారిటీల సంక్షేమానికి ఉద్దేశించి ప్రాధాన్యత అంశాల వారీగా బడ్జెట్ ప్రతిపాదన రూపొందించాలని మంత్రి ఆదేశించారు. కేంద్రం నుంచి వివిధ పథకాల ద్వారా వస్తున్న నిధులను మైనారిటీ వర్గాల సంక్షేమానికి రాబట్టుకోవడం తోపాటు, కేంద్ర నిధులను వినియోగించుకోవడంలో ప్రణాళికాబద్ధంగా, కార్యాచరణ సిద్ధం చేసుకుని ముందుకు నడవాలని హెచ్ఓడీ లను



మంత్రి ఆదేశించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా చేపట్టాల్సిన వివిధ సంక్షేమ , అభివృద్ధి పనుల కార్యాచరణను కూడా సిద్ధం చేయాలన్నారు . ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నదని మంత్రి ఫరూక్ స్పష్టం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని మంత్రి కి మైనారిటీ సంక్షేమ అనుబంధ విభాగాల అధిపతులు వివరించారు. ప్రధాన మంత్రి విరాసత్ క సంవర్ధన్ ( పీఎం వికాస్ ), ప్రధానమంత్రి జన్ వికాస్ కార్యక్రమం ( పీఎంజేవీకే ), జాతీయ మైనారిటీల అభివృద్ధి ఆర్థిక సంస్థ ( ఎన్ఎండి ఎఫ్ సి ) పథకాల ద్వారా రాష్ట్రానికి వచ్చే నిధుల వినియోగం పక్కాగా చేయాలని మంత్రి ఆదేశించారు. 2026-2027 ఆర్థిక సంవత్సరంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాల పంపిణీ, నూర్ భాషా/ దూదేకుల కార్పొరేషన్, షేక్ కార్పొరేషన్ లకు నిధులు కేటాయింపు తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రాధాన్యత క్రమం లో షాది ఖానాల, క్రిస్టియన్ భవనాల నిర్మాణం, వివిధ అభివృద్ధి పనులు,హజ్ యాత్ర-2026 కు ముందస్తు ఏర్పాట్లు,వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, అభివృద్ధి తదితర అంశాలపై మైనారిటీ సంక్షేమ శాఖ విభాగాలు ఏ విధంగా ముందుకు సాగుతున్నాయన్న విషయాలపై మంత్రి ఫరూక్ ఆయా విభాగాల ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర స్థాయి అధికారులందరూ జిల్లాలలో విస్తృతంగా పర్యటించి డిపార్ట్మెంట్ ఆస్తులు, షాదీఖానాలు, కమ్యూనిటీ హాల్స్, కంప్యూటర్ శిక్షణ కేంద్రాలు , లైబ్రరీలు, పాఠశాలలు, కళాశాలలు, హాస్టల్లు తనిఖీలు చేసి సమస్యలేమైనా ఉంటే సరిదిద్ది సక్రమంగా పనిచేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండి, వక్ఫ్ బోర్డు సీఈవో యాకుబ్ భాష, క్రిస్టియన్ కార్పొరేషన్ ఎండి ఏ.శేఖర్, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ గౌస్ పీర్, మైనారిటీ కమిషన్ కార్యదర్శి నిజాముద్దీన్, కమీషనర్ కార్యాలయ డీడీ సరోజినీ తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉద్యోగుల సమస్యల పరిష్కార కార్యక్రమం.

### జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి గణియా.

**నంద్యాల,జనవరి 29 రిపబ్లిక్ న్యూస్.**



రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నేడు(జనవరి 30) ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో జరుగుతుందన్నారు. జిల్లా స్థాయిలో పరిష్కరించగల సమస్యలకు అర్జీలు స్వీకరించి, 15 రోజుల్లోగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర స్థాయి అంశాలను సంబంధిత అధికారులకు వివరిస్తామన్నారు. వార్షిక ఇంక్రిమెంట్లు, స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్లు, కార్యాలయాల మౌలిక సదుపాయాలు, మహిళా ఉద్యోగుల సమస్యలు తదితర అంశాలపై అర్జీలు స్వీకరిస్తామని వివరించారు. అలాగే, క్రమశిక్షణారాహిత్య కేసులు పెండింగ్లో ఉండటంతో పదోన్నతులు, ఇంక్రిమెంట్లు నిలిచిపోయిన అర్జీలను కూడా పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ తప్పక హాజరు కావాలని ఆదేశించారు.

## కోవెలకుంట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్స్పెక్టర్ హనుమంత్ నాయక్ ఆధ్వర్యంలో అవగాహన





**నంద్యాల క్రైం, జనవరి 29, (రిపబ్లిక్ న్యూస్):** మహిళల భద్రత, బాల్య వివాహాలు, పోక్సో కేసులు, సైబర్ భద్రత, ఈవ్ టీజింగ్, శక్తి యాప్, మొబైల్ ఫోన్ దుర్వినియోగం, రహదారి భద్రత మొదలగు వాటిపై జిల్లావ్యాప్తంగా అన్ని స్కూళ్లు కళాశాలలో వసతి గృహాలలో విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్న జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ మేరకు కోవెలకుంట్ల ఇన్స్పెక్టర్ హనుమంత్ నాయక్ ఆధ్వర్యంలో గురువారం కోయిలకుంట్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలీస్ సిబ్బంది సహకారంతో కలిసి మహిళల భద్రత, బాల్య వివాహాలు, పోక్సో కేసులు, సైబర్ భద్రత, ఈవ్ టీజింగ్, శక్తి యాప్, మొబైల్ ఫోన్ దుర్వినియోగం, రహదారి భద్రత మొదలగు వాటి గురించి అవగాహన కల్పించడంతోపాటు ఏదైనా అత్యవసర సమయంలో పోలీసు శాఖ సహాయం కొరకు100, 112, నంబర్లకు ఫోన్ చేసి సహాయం పొందవచ్చునని, ఎవరైనా సైబర్ క్రైమ్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే1930 నెంబర్కు కాల్ చేసి సహాయం పొందవచ్చునని, మాదకద్రవ్యాల దుర్వినియోగానికి సంబంధించి 1972, చిన్నపిల్లలపై జరిగే అఘాయిత్యాలకు సంబంధించి1098 మొదలైన టోల్ ఫ్రీ నంబర్లకు కాల్ చేసి సహాయం పొందవచ్చునని అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాము.

## రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు నంద్యాల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఆధ్వర్యంలో అవగాహన








**నంద్యాల క్రైం, జనవరి 29, (రిపబ్లిక్ న్యూస్):**
రోడ్డు ప్రమాదాల నివారణ కొరకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్న నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఆదేశాలమేరకు నంద్యాల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ చాంద్ భాషా తన యొక్క సిబ్బందితో నంద్యాల పట్టణ కేంద్రంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో ఆటోడ్రైవర్లను, వాహనదారులను, ప్రజలను సమావేశపరిచి అందరికీ సులువుగా అర్థం చేసుకునే విధంగా దృశ్య మాధ్యమాల ద్వారా గోడ ప్రతుల ద్వారా రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యం చేరాలని అవగాహన కల్పించారు. ఈ సందర్భంలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు కలిగి కలిగి ఉండాలి. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా మానవ తప్పిదంతోనే జరుగుతున్నాయని కావున మోటర్ సైకిల్ పై ప్రయాణించేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను, వస్తువులను రవాణా చేయరాదని, డ్రైవర్ కు ఇరుపక్కల ప్రయాణికులను కూర్చోబెట్టుకొని వాహనం నడపరాదు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అపరిమిత వేగంతో వాహనాలు నడపరాదని మద్యం సేవించి వాహనాలు నడపరాదని మొదలగు రోడ్డు భద్రత ప్రాముఖ్యతల పై ప్రజలకు అవగాహన కల్పించారు.

# సర్వేయర్లపై ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవు

**వంద శాతం హాజరు నమోదు చేయాలి- ప్రజల్లో మంచి పేరు వచ్చేలా పని చేయాలి- జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జనవరి 29)**
జిల్లాలో సర్వేయర్లపై ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి హెచ్చరించారు. భూ సర్వే విభాగం పనితీరులో మరింత పారదర్శకత, బాధ్యత, ప్రజల నమ్మకం పెంపొందించాల్సిన అవసరం ఉందని ఆమె స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్లోని సునయన ఆడిటోరియంలో భూ సర్వే విభాగానికి సంబంధించిన ఎఫ్పీఓఎల్ఆర్, రీసర్వే, ఐవీఆర్ఎస్ కాల్స్ తదితర అంశాలపై విలేజ్ సర్వేయర్లు, మండల సర్వేయర్లు, సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేయర్ల పనితీరుపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒకటి, రెండు దరఖాస్తులు వచ్చినా సకాలంలో పూర్తి చేయలేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, నోటీసులు ఇవ్వకుండా ఫీల్డ్కు వెళ్లడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం సర్వే నిర్వహించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. రీసర్వేలో అక్రమంగా డబ్బులు తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం



చేశారు. ప్రజల్లో మంచి పేరు వచ్చేలా విధులు నిర్వర్తించాలని సూచించారు. విలేజ్ సర్వేయర్లు ప్రతిరోజూ విధులకు హాజరైనట్లు వంద శాతం అటెండెన్స్ నమోదు చేయాలని ఆదేశించారు. హాజరు నమోదు చేయని వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్వేయర్లు తప్పనిసరిగా తహసీల్దార్కు రిపోర్ట్ చేయాలని, రెవెన్యూ శాఖతో సమన్వయంతో పని చేయాలని సూచించారు. సర్వే విభాగం పనితీరులో స్పష్టమైన మార్పు రావాలని,



సమిష్టిగా కృషి చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర స్థాయిలో జిల్లా టాప్5 ర్యాంకులో నిలవాలంటే ప్రతి ఉద్యోగి బాధ్యతగా పని చేయాలని కలెక్టర్ సూచించారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ సర్వేకు సంబంధించిన అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా సర్వే అధికారి మునికన్నన్, ఆర్డీవో సందీప్ కుమార్, సంబంధిత అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో టూరిజం అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు

**ప్రఖ్యాత పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై జిల్లా టూరిజం డెవలప్మెంట్ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి స్పష్టం**

**కర్నూలు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జనవరి 29)**
జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అన్నారు. గురువారం కలెక్టరేట్లో నిర్వహించిన జిల్లా టూరిజం డెవలప్మెంట్ కమిటీ సమావేశానికి చైర్మన్ హోదాలో జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మంత్రాలయం, ఉరుకుంద, పెద్ద తుంబళం, కోటేకల్, ఆదోని, కర్నూలు, కాల్వబుగ్గ, ఓర్వకల్లు రాక్ గార్డెన్స్, బ్రహ్మగుండం, కేతవరం తదితర ప్రముఖ పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలోని ఇతర పర్యాటక ప్రదేశాలను ప్రజలు సందర్శించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ, అదనపు మౌలిక సదుపాయాలు కల్పించి టూరిజానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రాజెక్టు రిపోర్టులు తయారు చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఓర్వకల్లు రాక్ గార్డెన్స్లో ఉత్సవాలు నిర్వహించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా



టూరిజం అధికారి లక్ష్మీనారాయణ, సెట్కూర్ సీఈవో వేణుగోపాల్లను ఆదేశించారు.

గాజులదిన్నె, సుంకేసుల ప్రాజెక్టులు, ఆదోని రాంజల్ వాటర్ ట్యాంక్ వద్ద బోటింగ్, రెస్టారెంట్లు, మౌలిక సదుపాయాల ఏర్పాటుకు ప్రాజెక్టు నివేదికలు సిద్ధం చేయాలన్నారు. మంత్రాలయానికి వచ్చే భక్తులను జిల్లాలోని ఇతర పర్యాటక ప్రాంతాలు, జాతరలు, పండుగల సందర్భంగా జరిగే ఉత్సవాలను సందర్శించేలా ఆకర్షణీయమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎమ్మిగనూరు వస్త్రాలకు సరైన మార్కెట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే జిల్లాతో పాటు ఇతర జిల్లాల దేవాలయాల సందర్శనకు టెంపుల్ టూరిజం ప్రాజెక్టు రిపోర్టును కూడా సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో టూరిజం అధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రూ.14 కోట్ల వ్యయంతో జిల్లాలో టూరిజం అభివృద్ధికి సంబంధించి ఐదు ప్రాజెక్టు నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిపారు.

కమిటీ సభ్యుడు పత్తి ఓబులయ్య జిల్లాలో అనేక చారిత్రాత్మక ప్రదేశాలు ఉన్నాయని, వాటి వైభవాన్ని చాటిచెప్పేలా కందనవోలు ఉత్సవాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ను కోరారు.

ఈ సమావేశంలో సెట్కూర్ సీఈవో వేణుగోపాల్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ తేజస్వి, ఇన్చార్జి డ్వామా పీడీ మాధవిలత, కల్చరల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పత్తి ఓబులయ్య, టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నారాయణ, సీపీఓ భారతి, ఇరిగేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ బాలచంద్రారెడ్డి ఫోన్ ద్వారా పాల్గొన్నారు.

# ఇళ్ల నిర్మాణాలను గడువులోపల పూర్తి చేయాలి.

**నిర్మాణ పనుల్లో వేగాన్ని పెంచండి. -అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**

**నంద్యాల, జనవరి 29 రిపబ్లిక్ న్యూస్.**
జిల్లాలో నిర్దేశించిన ఇళ్ల నిర్మాణాల పనులను గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి మున్సిపల్ కమిషనర్లు, డీఎల్డివోలు, ఎంపీడీవోలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఉగాది నాటికి 10,178 ఇళ్లు పూర్తి చేయాలని నిర్దేశించిన లక్ష్యంలో భాగంగా వారపు లక్ష్యాలు కూడా నిర్దేశించుకుని పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బేస్మెంట్ లెవల్ లో ఉన్న 6,905 లెంటల్ లెవల్ లో ఉన్న 2,794, రూఫ్ లెవల్లో ఉన్న 479 ఇళ్లన్నీ ఉగాది



నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (అర్బన్) 2.0 పథకం కింద మంజూరైన 2,348 ఇళ్లలో 409 ఇళ్లు గ్రౌండింగ్ అయ్యాయని మిగిలిన 1,939 ఇళ్లను కూడా ఫిబ్రవరి 5 నాటికి వంద శాతం గ్రౌండింగ్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. చెంచు కాలనీల్లో నిర్మించే పీఎమ్ జన్మన్ కింద మంజూరైన 556 గృహాలలో 282 ఇళ్లు గ్రౌండింగ్ అయ్యాయని మిగిలిన 334 ఇళ్లను కూడా గ్రౌండింగ్ చేయాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లకు సంబంధించి మంజూరైన 26,609 యూనిట్లలో 12,394 పూర్తి అయ్యాయని బేస్మెంట్ స్థాయిలో ఉన్న 3,312 వ్యక్తిగత మరుగుదొడ్లతోపాటు పెండింగ్ లో ఉన్న టాయిలెట్లను కూడా గ్రౌండింగ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (ఆల్ ప్లస్) కార్యక్రమానికి సంబంధించి పెండింగ్లో ఉన్న డేటాను తక్షణమే పూర్తి చేయాలన్నారు. పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్న అంశాన్ని ప్రతి అధికారి దృష్టిలో పెట్టుకొని పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic144@gmail.com